జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

కృష్ణ | శనివారం 11 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :178 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: ప్రపంచ జనాభా దినోత్సవం, సూర్యోదయం: 5:33 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 2:59 । చంద్రాస్తమయం: 3:29 , తిథి: బహుళ ద్వాదశి రా. 11:24 వరకు, తదుపరి త్రయోదశి నక్షత్రం: కృత్తిక ఉ. 8:40 వరకు, తదుపరి రోహిణి, యోగం: గండ రా. 11:06 వరకు, తదుపరి వృద్ధి కరణం: కౌలవ మ. 12:35 వరకు, తదుపరి తైతుల రా. 11:24 వరకు, తదుపరి గరజ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

- ఇదే అదనుగా నాసా టెక్నాలజీ అంటూ నకిలీ ఏసీల అమ్మకం!
- యూకేలో పోర్టబుల్ ఏసీల పేరిట భారీ ఆన్‌లైన్ మోసం
- నాసా టెక్నాలజీ, 90 సెకన్లలో కూలింగ్ అంటూ తప్పుడు ప్రచారం
- ఇవి ఏసీలు కావు, కేవలం తడి అట్టలున్న ఫ్యాన్లు మాత్రమే
- ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక




## ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం

- ఈ20 పెట్రోల్‌తో వాహనాల మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చు : కేంద్రం
- ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని వెల్లడి
- 2025-26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుంది





## ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా

- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయాలు
- ఔషధాల్లో 12 శాతానికి మించి ఆల్కహాల్ ఉంటే లైసెన్స్ తప్పనిసరి
- ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి
- ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోంది


- కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ
- శ్రీవారిని దర్శించుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు
- బాలాజీ సేవలో పాల్గొన్న శ్రీలంక డిప్యూటీ కమిషనర్ గణేశనాథన్ గేతీశ్వరన్
- తీర్థప్రసాదాలను అందజేసిన ఆలయ అర్చకులు

**అమరావతి**

తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోందని కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ అన్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరిలు ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో మూలవిరాట్టు దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి - మిగతా3లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూమలిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్




**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు. సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల - మిగతా3లో

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ



- చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్
- 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నామన్న మోదీ
- క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడి



## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

- బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం
- తొక్కిసలాట తర్వాత సీఎం హోదాలో తొలిసారి కరూర్‌కు విజయ్
- కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన విజయ్ ప్రభుత్వం

## మహిళలకు వెరీ 'గుడ్డు' ఉపాధి

- మూడో దశలో మరో 55 మందికి అవకాశం
- తొలిసారిగా గుడ్లతో తయారు చేసే ఆహార వంటకాల యూనిట్లు
- అతివలు ఆర్థికంగా బలోపేతం అవుతుండడంతో మూడో దశలో మరో 55 మందికి ఉచితంగా యూనిట్లు



**హైదరాబాద్**

తెలంగాణ వ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 98 శాతం ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరిగిందని.. ఈనెల 24వ తేదీ వరకు పత్రాల డిజిటల్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్స్ రాకపోతే ఆగష్టులో ఫామ్ 6, 8 ఇస్తారని.. నింపి ఇవ్వాలన్నారు. 'సర్' ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త - మిగతా3లో

# ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి



- ఏపీలో ఆటోమోటివ్ ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం
- పుంగనూరులో ఈవీ క్లస్టర్, ప్రతి 30 కి.మీ.లకు ఒక ఛార్జింగ్ స్టేషన్
- కొరియా ఆటో ఇండస్ట్రీస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

**అమరావతి**

సుస్థిర ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 కింద ఆంధ్రప్రదేశ్ లో విస్తృతమైన ఆటోమోటివ్ ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం, ఇందులో కొరియన్ సంస్థలు భాగస్వామ్యం వహించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. కొరియా ఆటో ఇండస్ట్రీస్ కోఆపరేషన్ ఏజెన్సీ ఛైర్మన్ టేక్-సుంగ్ లీ - మిగతా3లో




## జాతీయ గీతం తప్పనిసరి!

- జాతీయ గీతం జనగణమన, వందేమాతరం ఆలాపనపై కేంద్రం కీలక ఆదేశాలు
- జాతీయ గీతం, జాతీయ గేయం ఆలాపనలో సరైన సాహిత్యం, ఉచ్చారణ తప్పనిసరి
- కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా మార్గదర్శకాల్ని పునరుద్ఘాటించిన కేంద్రం

## ముత్తూట్ ఫైనాన్స్‌లో భారీ మోసం

- కస్టమర్ల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టు పెట్టిన మేనేజర్
- హైదరాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో వెలుగుచూసిన వైనం
- కస్టమర్ల బంగారాన్ని దుర్వినియోగం చేశారని బ్రాంచ్ మేనేజర్‌పై ఆరోపణ
- తక్కువ వడ్డీ ఆశ చూపి సొంత ఖాతాలకు డబ్బు మళ్లింపు
- మేనేజర్ ప్రియాంక రెడ్డిపై కేసు నమోదు చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు



# ఆల్కహాల్ ఉన్న ఔషధాలపై కేంద్రం నిఘా



ఔషధాల దుర్వినియోగాన్ని అరికట్టడం, వాటిని మత్తు కోసం వాడకుండా నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇకపై లైసెన్స్ తప్పనిసరి చేసింది. వీటికి కఠిన నియంత్రణలు వర్తిస్తాయని, ఈ ఔషధాలు విక్రయించాలంటే లైసెన్స్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉండే ఔషధాలకు ఇప్పటి వరకు లైసెన్స్ నుంచి మినహాయింపు ఉండేది. అయితే తాజాగా ఈ మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఖ ప్రకారం, ఇప్పటి వరకు యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన 'టింక్చర్స్' లాంటి కొన్ని ఔషధ ఉత్పత్తులకు ఇంత వరకు లైసెన్స్ అవసరం లేకుండా మినహాయింపు ఉండేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే ఈ రకమైన కొన్ని ఔషధాల్లో ఇథైల్ ఆల్కహాల్ పరిమాణం చాలా ఎక్కువగా ఉంటోంది. కొన్నింటిలో అయితే ఏకంగా 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉంటోంది. అందువల్ల వీటిని మత్తు కోసం దుర్వినియోగం చేసే అవకాశం ఎక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించింది.

ఈ సమస్యను పరిష్కరించడానికి 30 మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉండి, 12 శాతానికిపైగా పైగా ఇథైల్ ఆల్కహాల్ కలిగిన అన్ని రకాల ఔషధాలకు షెడ్యూల్–కె కింద ఇచ్చే మినహాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఇటువంటి ఉత్పత్తులకు ఇకపై 'డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940' కింద అవసరమైన లైసెన్సులను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, ఈ సవరణ ద్వారా ఈ ఔషధాలను డ్రగ్స్ రూల్స్, 1945లోని షెడ్యూల్ ఎ1 పరిధిలోకి మార్చారు. దీని ప్రకారం, రిజిస్టర్డ్ డాక్టర్ రాసిన మందుల చీటీ ఉంటేనే ఈ ఔషధాలను విక్రయించాల్సి ఉంటుంది. అలాగే ఆ విక్రయాలకు సంబంధించిన రికార్డులను చాలా కఠినంగా నిర్వహించాల్సి ఉంటుంది.

"ఈ సవరణ ద్వారా ఆల్కహాల్ ఉన్న ఔషధ ఉత్పత్తులపై నియంత్రణ ఏర్పడుతుంది. ఇవి కేవలం గుర్తింపు పొందిన ఫార్మాస్యూటికల్ సప్లై చైన్ ద్వారానే సరఫరా అవుతాయి. ఫలితంగా ఈ డ్రగ్స్ పక్కదారి పట్టే అవకాశం, దుర్వినియోగం అయ్యే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది. అదే సమయంలో నిజమైన వైద్య అవసరాల కోసం ఇవి నిరంతరం అందుబాటులో ఉంటాయి" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.

ప్రస్తుతం ఉన్న డ్రగ్స్ నిబంధనల ప్రకారం, వివిధ సంప్రదాయ వైద్య విధానాల్లో ఇప్పటికే ఆల్కహాల్ పరిమితులు అమలులో ఉన్నాయి. రూల్ 161 ప్రకారం, ఆయుర్వేద, సిద్ధ, యునాని సిరప్?లలో గరిష్ఠంగా 16 శాతం ఆల్కహాల్? మాత్రమే అనుమతిస్తారు. అదే విధంగా రూల్? 106బీ ప్రకారం, హోమియోపతి మందుల్లో ఆల్కహాల్ పరిమాణం 12 శాతానికి పరిమితం చేస్తారు. తాజా సవరణ ప్రకారం, కేవలం యాలకులు, అల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలు ఉన్నాయనే కారణంతో 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉన్న ఔషధాలకు ఇకపై షెడ్యూల్?–కె కింద మినహాయింపు ఇవ్వరు. నిజమైన వైద్య అవసరాల కోసం వీటిని నిరంతరం అందుబాటులో ఉంచుతూనే, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఔషధాల నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడం, మందుల బాధ్యతాయుమైన, సరైన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్యాన్ని రక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన గెజిట్? నోటిఫికేషన్? ఆరోగ్య మంత్రిత్వశాఖ తన అధికారిక వెబ్?సైట్?లో అందుబాటులో ఉంటుంది.

# జాతీయ గీతం తప్పనిసరి!




జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ఆలపించేటప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. వీటిని ఆలపించేటప్పుడు లేదా వాయిద్య ప్రదర్శన సమయంలో అధికారికంగా నిర్దేశించిన సాహిత్యాన్ని, స్పష్టమైన ఉచ్చారణను, పదాల స్పష్టతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. అధికారిక లిపిని, పద వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ శాఖలతో సహా అన్ని రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాలకు జులై 9న హోం శాఖ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో జాతీయ గీతం, జాతీయ గేయాన్ని ఏ సందర్భాల్లో తప్పనిసరిగా ఆలపించాలి లేదా వినిపించాలి. ఏ సందర్భంలో అవసరాన్ని బట్టి వినిపించొచ్చు అనే దానికి సంబంధించి ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని హోం శాఖ పునరుద్ఘాటించింది. హోం శాఖ ఆదేశాల ప్రకారం– జాతీయ గీతం, జాతీయ గేయాలను ఆలపించే లేదా ప్లే చేసే ప్రతి సందర్భంలోనూ అధికారికంగా ఆమోదించిన సాహిత్యాన్నే ఉపయోగించాలి. పదాల ఉచ్చారణ, స్పష్టతలో (డిక్షన్) ఎలాంటి పొరపాట్లు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక సాహిత్యం, ఉచ్చారణ మార్గదర్శకాలను హోం శాఖ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.

**వందేమాతరం ఎప్పుడు ఆలపించాలి?**

కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల ప్రకారం– పౌర పురస్కారాల ప్రదానోత్సవాలు, రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో ఆయన వచ్చే సమయంలో, తిరిగి వెళ్లే సమయాల్లో వందేమాతరం ఆలపించాలి. రాష్ట్రపతి రేడియో (ఆకాశవాణి), టీవీల ద్వారా దేశ ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించే ముందు, ప్రసంగం ముగిసిన తర్వాత కూడా దీనిని వినిపించాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో గవర్నర్, కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లు అధికారిక కార్యక్రమాలకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు, ఇంకా పరేడ్‌లో జాతీయ జెండాను తీసుకొచ్చే సందర్భాల్లో జాతీయ గేయం వందేమాతరం వినిపించాలని స్పష్టం చేసింది. వీటితో సహా ఇంకా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశించే ఇతర సందర్భాల్లోనూ జాతీయ గేయాన్ని వాడుకోవచ్చని పేర్కొంది.

**రాష్ట్ర గీతం ఉంటే పాటించాల్సిన క్రమం ఇదే**

కొన్ని రాష్ట్రాల్లో జాతీయ గీతం లేదా జాతీయ గేయంతో పాటు రాష్ట్ర గీతాన్ని కూడా ఆలపించే ఆనవాయితీ ఉందని హోం శాఖ పేర్కొంది. అలాంటి సందర్భాల్లో ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన ఆలపించాలని స్పష్టం చేసింది. జాతీయ గేయం, జాతీయ గీతానికి సముచిత గౌరవం కల్పించే విధంగా ఈ క్రమాన్ని పాటించాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 28న హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కూడా తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. అధికారిక కార్యక్రమాల్లో 3 నిమిషాల 10 సెకన్ల నిడివి గల ఆరు చరణాల అధికారిక రూపంలోని వందేమాతరం ఆలపించాలని పేర్కొంది. జాతీయ గేయం ఆలపించే సమయంలో సభలో ఉన్న ప్రతి ఒక్కరూ అటెన్షన్ పొజిషన్‌లో కచ్చితంగా నిల్చోవాలని స్పష్టం చేసింది.

**వందేమాతరం, జనగణమనకు సమాన హోదా, గౌరవం**

వందేమాతరం ఎప్పుడు పాడాలనే అంశంపై అన్ని సందర్భాలను ఒక జాబితా రూపంలో నిర్దేశించలేమని కేంద్రం పేర్కొంది. కానీ జాతీయ గేయానికి ఇవ్వాల్సిన సముచిత గౌరవాన్ని, క్రమశిక్షణను పాటిస్తూ– ప్రజలు ఎక్కడైనా, సామూహికంగా దీనిని ఆలపించవచ్చని, అందుకు ఎలాంటి ఆంక్షలు లేదా అభ్యంతరాలు లేవని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఈ మార్గదర్శకాల్ని మరోసారి గుర్తు చేసింది. 1950 జనవరి 24న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన తీర్మానం ప్రకారం రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'జనగణమన' ను భారత జాతీయ గీతంగా గుర్తించింది. అదే తీర్మానంలో భారత స్వాతంత్రోద్యమంలో చారిత్రక పాత్ర పోషించిన బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి కూడా జనగణమనతో సమాన గౌరవ హోదా కల్పించాలని నిర్ణయించింది.

# ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం




ఇథనాల్ 20 పెట్రోల్ కారణంగా కొన్ని వాహనాల్లో మైలేజీ 3 నుంచి 5 శాతం తగ్గొచ్చని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కానీ దీని ప్రభావం కంటే ప్రయోజనాలే ఎక్కువ ఉన్నాయని వివరించింది. ఈ 20 పెట్రోల్‌తో మంచి ఇంజిన్ పనితీరు, మెరుగైన పికప్, తక్కువ కర్బన ఉద్గారాల విడుదల వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపింది. ఇది అధిక నాణ్యత, సమర్థవంతమైన ఇంధనం అని పేర్కొంది. అనేక సంవత్సరాలుగా శాస్త్రీయ పరీక్షల తర్వాతే దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే కార్యక్రమంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టేందుకు 'సందేహాలు– సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే ప్రక్రియను చాలా వేగంగా అమలు చేశారన్న ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. భారత్‌లో ఈ కార్యక్రమం 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని చెప్పింది. 2018లో జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టి ఉత్పత్తిని ప్రభుత్వం వేగవంతం చేసిందని తెలిపింది. ప్రత్యేక ఇథనాల్ ప్లాంట్లు, నిల్వ, లాజిస్టిక్స్‌లో పెట్టుబడుల తర్వాత భారత్ 2022లోనే నిర్దేశిత సమయానికి ముందే 10 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించిందని చెప్పింది. 2025–26 ఇథనాల్ సరఫరా సంవత్సరంలో 20 శాతం మిశ్రమాన్ని చేరుకుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**పాత వాహనాలు పాడవుతాయా?**

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపైనా కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. దేశవ్యాప్తంగా ఈ20ను పెట్రోల్?ను ప్రవేశపెట్టే ముందు ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, పికప్?, ఉద్గారాలపై విస్తృతమైన పరీక్షలు చేశామని చెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ20 వల్ల వాహనంలో తుప్పు, అసాధారణ అరుగుదల లేదా భాగాల జీవితకాలం దెబ్బతినడం వంటి సమస్యలను సర్వీస్ చేసిన వాహనాల్లో తాము ఎదుర్కోలేదని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్‌తో సహా ఆటోమొబైల్ తయారీదారుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రస్తావించింది.

**వేర్వేరు పెట్రోల్‌లు సాధ్యం కాదు**

పెట్రోల్ పంపులు శుద్ధమైన పెట్రోల్, ఈ10, ఈ20 వంటి ఇంధన గ్రేడ్‌లను అందించాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. దేశవ్యాప్తంగా ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని వివరించింది. దీని వల్ల దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని పేర్కొంది.

**ఇతర దేశాలపై ఆధారపడడాన్ని తగ్గించడమే లక్ష్యం**

ఇక ధరల విషయానికొస్తే, రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ ధరలు పెట్రోల్ ధరను మించవచ్చని అంచనా వేసింది. అందువల్ల సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని స్పష్టం చేసింది. ధరలను తగ్గించడం కంటే దిగుమతి చేసుకున్న ముడి చమురుపై భారత్? ఆధారపడటాన్ని తగ్గించడం, ధరల స్థిరత్వాన్ని మెరుగుపరచడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడమే దీని ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

**ఇప్పటి వరకు రూ.1.97 లక్షల కోట్లు ఆదా**

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల 2014–15 నుంచి రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలను విడుదల చేసింది. 2014–15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని వివరించింది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## ఉక్కపోతతో అల్లాడుతున్న బ్రిటన్

యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఎండలు మండిపోతున్న వేళ, చల్లదనం కోసం చూస్తున్న ప్రజలే లక్ష్యంగా ఓ భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. "నాసా మాజీ ఇంజనీర్లు రూపొందించారు", "కేవలం 90 సెకన్లలో గదిని చల్లబరుస్తుంది" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలతో ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోర్టబుల్ ఎయిర్ కండీషనర్ల (ఏసీ) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఇదంతా ఓ పెద్ద స్కామ్ అని తేలింది. ఈ వ్యవహారంపై బీబీసీ ప్రచురించిన కథనం ప్రకారం, ఈ పరికరాలు ఏసీలు కావని, కేవలం సాధారణ ఫ్యాన్లు మాత్రమేనని స్పష్టమైంది. ఈ మోసపూరిత ప్రకటనల్లో, చిన్నగా ఉండే ఈ పరికరాలను శక్తివంతమైన ఏసీలుగా చిత్రీకరిస్తున్నారు. సుమారు 70 నుంచి 120 పౌండ్లు (దాదాపు రూ. 7,000 నుంచి రూ. 12,000) ధర పలికే ఈ పరికరాలకు నాసా టెక్నాలజీని జోడించి ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకమైన కూలింగ్ క్యాట్రిడ్జ్‌లు, తక్కువ విద్యుత్ వినియోగం వంటి ఫీచర్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. వీటిని అత్యాధునికంగా చూపించేందుకు, రాగి తీగలు, మెటల్ బాక్సులతో ఉన్నట్టుగా కృత్రిమ మేధ (ఏఐ)తో సృష్టించిన ఫోటోలను వాడుతున్నారు. వాస్తవానికి, ఇవి ఏసీలు కానే కావు. వీటిని "స్వాంప్ కూలర్లు" అని పిలిచే సాధారణ ఎవాపరేటివ్ కూలర్లుగా నిపుణులు తేల్చారు. అంటే, ఒక ఫ్యాన్‌కు తడి అట్ట లేదా స్పాంజ్ లాంటిదాన్ని అమర్చి, దాని ద్వారా గాలిని బయటకు పంపే పరికరాలు. అసలైన ఏసీలలో గదిలోని వేడిని బయటకు పంపేందుకు కంప్రెసర్, ఎగ్జాస్ట్ పైపు ఉంటాయి. కానీ, ఈ నకిలీ పరికరాల్లో అలాంటి వ్యవస్థ ఉండదు. పైగా, ఇవి గదిలోని తేమను మరింత పెంచుతాయి. యూకే వంటి తేమతో కూడిన వాతావరణంలో ఇవి గదిని చల్లబరచకపోగా, మరింత ఉక్కపోతను సృష్టిస్తాయి. "ప్రాపర్ డీఐవై" యూట్యూబర్ స్టువర్ట్ మాథ్యూస్ వీటిని పరీక్షించి, ఇవి "చౌకబారు విడిభాగాలతో, తప్పుడు శాస్త్రీయ సూత్రం ఆధారంగా పనిచేసే పనికిరాని వస్తువులు" అని తేల్చిచెప్పారు. యూకేకు చెందిన అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఏఎస్‌ఏ) కూడా ఈ ప్రకటనలపై వినియోగదారులను హెచ్చరించింది. "నమ్మశక్యం కాని హామీలు, రహస్య ఆవిష్కరణల కథలు, నకిలీ రివ్యూలు" వంటివి కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి ప్రకటనలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నేరుగా జరిమానాలు విధించే అధికారం తమకు లేదని ఏఎస్‌ఏ తెలిపింది. ఏదైనా పరికరం కొనే ముందు, దానిపై స్వతంత్ర రివ్యూలను పరిశీలించడం చాలా ముఖ్యమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## తొక్కిసలాట సమయంలో పోలీసులు నాటకం చూశారు

కరూర్ తొక్కిసలాట ఘటనను అడ్డుపెట్టుకుని అప్పటి అధికార పార్టీ ఐవీఖ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించిందని తమిళనాడు సీఎం విజయ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో కరూర్‌లో పర్యటించకుండా అప్పటి ఐవీఖ ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. కరూర్ తొక్కిసలాటలో బాధితుల కుటుంబసభ్యులకు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. 32 కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను సీఎం ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి కరూర్‌లో పర్యటిస్తున్నారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. తొక్కిసలాట ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐవీఖతో పాటు కరూర్ పోలీసులపై విజయ్ విమర్శలు గుప్పించారు. ర్యాలీకి జనం పోటెత్తుతున్నప్పుడు సభను రద్దు చేసే పూర్తి అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ, వారు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని విజయ్ మండిపడ్డారు. తాను పోలీసులను పూర్తిగా నమ్మానని, కానీ ఇదంతా ఎవరి ఆదేశాలతో జరిగిన నాటకమో చెప్పాలని ఆయన నిలదీశారు. నల్ల దుస్తులు ధరించి సభకు హాజరైన సీఎం విజయ్ తొక్కిసలాటలో మరణించిన చిన్న పిల్లలు, ఇతర బాధితుల జ్ఞాపకార్థం తమ పార్టీ తరఫున ఒక స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కరూర్ తొక్కిసలాట బాధ తన జీవితంలో ఏ విజయమూ చెరపలేదని విజయ్ పేర్కొన్నారు. ఎంతోమంది అమాయక పిల్లలు ఈ ప్రమాదంలో చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు.

"ఒక మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించినా సరే తన జీవితంలో ఎక్కడో ఓ చోట బాధాకరమైన క్షణాలను ఎదుర్కోక తప్పదు. నా రాజకీయ ప్రయాణంలో కరూర్ ఘటన అలాంటిదే. ఆ తొక్కిసలాటలో ఎంతోమంది తల్లులు తమ బిడ్డలను కోల్పోయారు. దీనికి బాధ్యులెవరు? ఆ రోజు ర్యాలీకి రద్దీ ఎక్కువగా ఉందని పోలీసులకు అనిపించినప్పుడు మమ్మల్ని అలర్ట్ చేయాల్సింది. లేదా సమావేశాన్ని రద్దు చేయాల్సింది. వారికి అన్ని హక్కులూ ఉన్నాయి కదా! కానీ, అవేవీ చేయకుండా వారు డ్రామా చూశారు. బహుశా అలా చేయమని వారిపై ఎవరి (నాటి డీఎంకే ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ఒత్తిడైనా ఉండి ఉంటుంది. రద్దీని నియంత్రించగలరని నేను పోలీసులను నమ్మాను. కానీ, నా వల్లే మరణాలు జరిగాయని నాడు నాపై నిందలేశారు. ఘటన తర్వాత నేను పారిపోయానని ప్రత్యర్థులు నాపై బురదజల్లారు. కానీ, నేను పారిపోలేదు. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా"

**సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం**

ఇదిలా ఉండగా, సీఎం పర్యటనలో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో ఉన్న మద్దతుదారుల మధ్య ఒక వ్యక్తి బారికేడ్లను దాటుకుని ముఖ్యమంత్రి కాన్వాయ్ వైపు దూసుకెళ్లాడు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, ఆ వ్యక్తి ముఖ్యమంత్రి వాహనాన్ని చేరుకోకముందే అడ్డుకుని అక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కాన్వాయ్ ఎటువంటి అంతరాయం లేకుండా తన గమ్యస్థానానికి చేరుకుంది. అటు విజయ్ పర్యటన నేపథ్యంలో కరూర్‌లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ అంతటా భారీగా పోలీసు బలగాల మోహరింపు, ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సభకు హాజరయ్యే వారికోసం ప్రత్యేకంగా ఌ= కోడ్ ఆధారిత ప్రవేశ పాస్‌లు జారీ చేశారు. మరోవైపు ఈ పర్యటనపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. సీఎం కరూర్ పర్యటన కేవలం రాజకీయ ప్రేరేపితమని, ఇది ఈ కేసుపై జరుగుతున్న జదీ× విచారణను ప్రభావితం చేస్తుందని ఆరోపిస్తున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో గతేడాది సెప్టెంబరులో కరూర్ ఘటన జరిగింది. గతేడాది సెప్టెంబర్ 27న ఎఖ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన విజయ్, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు తాజాగా అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు.

## 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు రెడీ

2030లో కామన్వెల్త్ క్రీడలకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2036లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. ఈ ప్రపంచ స్థాయి ఈవెంట్‌లను నిర్వహించడానికి క్రీడా మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2032లో బ్రిస్బేన్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ జరగనుండటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఏ క్రీడా లీగ్‌కైనా, భారతదేశంలో ఒక ఈవెంట్‌ను నిర్వహించడం విస్తృతమైన గుర్తింపు లభిస్తాయని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మోదీ, మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సందర్శించారు. అనంతరం ఆయన ఈ మేరకు మాట్లాడారు.

**యువ క్రికెటర్లతో ముచ్చటించిన మోదీ**

చరిత్రాత్మక క్రీడా వేదికను సందర్శించిన సందర్భంగా ప్రధాని మోదీ, యువ క్రికెటర్ల జెర్సీలపై సంతకాలు చేశారు. అనంతరం, క్రీడా ప్రతిభావంతులతో ముచ్చటించారు. ఆస్ట్రేలియా అధికారిక చిహ్నమైన "రూబీ ది రూ"తో ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ శోభను మరింత పెంచుతూ, ఆస్ట్రేలియా పురుషుల క్రికెట్ జట్టు దిగ్గజ మాజీ కెప్టెన్ స్టీవ్ వా స్టేడియంలో మోదీని కలిశారు. "వీజ+లోకి అడుగుపెట్టగానే ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు భావోద్వేగాలు కలుగుతాయి. మొదటిది, భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్సాహం. రెండోది, మన రెండు దేశాల్లో క్రికెట్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది ఒక ఉమ్మడి అభిరుచి అనే వాస్తవం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇక, స్టేడియం పర్యటనకు ముందు ఆస్ట్రేలియా ప్రతిపక్ష నేత అంగస్ టేలర్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలల విస్తృత చర్చలు జరిపారు. భారత్–ఆస్ట్రేలియా సంబంధాలు బలపడుతున్న తీరు, భవిష్యత్తు అవకాశాలపై తామిద్దరం ఆసక్తికరమైన చర్చలు జరిపినట్లు మోదీ తెలిపారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి
మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.



రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.
దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.
విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫొరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.
సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.
ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్‌ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**

ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅషవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**

అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.
విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.
రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.
తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.

**హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.**

కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

## ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి

-మొదటిపేజీ తరువాయి
నేతృత్వంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఈవీ ఎకో సిస్టమ్ అభివృద్ధిలో భాగంగా పూర్తి ఏపీఎస్ఆర్టీసీ ఫ్లీట్ విద్యుదీకరణ, గ్రీన్ కారిడార్లలో ప్రతి 30 కి.మీ.కు ఛార్జింగ్ స్టేషన్లు, ఈ-మొబిలిటీ నగరాలకు ఈవీ ఆర్‌డడీ గ్రాంటు, పుంగనూరు ఈవీ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈవీ మాగ్నెట్‌ల కోసం ఏపీలో కేంద్రప్రభుత్వ సహకారంతో రేర్ ఎర్త్ కారిడార్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ లో 100 కి.మీ.ల పరిధిలో ఆటోమోటివ్ విడిభాగాల ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నాం, ఇందులో కియా, దాని అనుబంధ సంస్థలతోపాటు అశోక్ లేలాండ్, ఇసుజీ మోటార్స్, హీరో మోటో కార్ప్, అమర్ రాజా, అపోలో టైర్స్, భారత్ ఫోర్జ్ వంటి ప్రధాన సంస్థలు అంతర్భాగంగా ఉన్నాయని చెప్పారు. అశోక్ లేలాండ్ సంస్థ 2,500 కోట్లతో లిథియం అయాన్ ఈ-బస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తోందని తెలిపారు.
కియా విజయగాథ మా కమిట్ మెంట్, శక్తి, సామర్థ్యాలకు నిదర్శనం. కియా క్లస్టర్ (అనంతపురం) సమీపాన ఒకటి, శ్రీసిటీ--చిత్తూరు--తిరుపతి కారిడార్ వెంబడి మరొక ప్రత్యేక కొరియన్ ఆటో కాంపోనెంట్స్ పార్క్ లు అభివృద్ధి చేస్తాం, ఇక్కడ ప్లగ్ అండ్-ప్లే షెడ్లు, ఉమ్మడి టూలింగ్/టెస్టింగ్ సౌకర్యాలు, పూర్తిస్థాయి సదుపాయాల కోసం ఒక కొరియా డెస్క్ ఏర్పాటుచేస్తామన్నారు. ఘాాూాణజ ద్వారా పరిశ్రమకు అనుగుణంగా రూపొందించిన ప్రోగ్రామ్‌లు, కౌశలం ప్లాట్‌ఫామ్, సభ్య కంపెనీలతో కలిసి ప్రెస్/బాడీ/పెయింట్-షాప్ ఆపరేషన్స్ స్కిల్డ్ వర్క్ ఫోర్స్ తయారీలో కీలకపాత్ర వహిస్తున్నాయి. జుం పవర్‌ట్రెయిన్‌ల కోసం అకాడమీని ఏర్పాటుచేసి, కొరియన్-స్థాయి ఆటో నైపుణ్య శిక్షణకు కొరియన్ సంస్థలు ముందుకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం. ఇందుకోసం ఏపీలోని 250కి పైగా ఇంజనీరింగ్ కళాశాలల సహకారం తీసుకోండి. దక్షిణ కొరియాతో ఆంధ్రప్రదేశ్ సంబంధాన్ని మరింత పటిష్టం చేస్తూ, ఘాాజుణదీలో కొరియా డెస్క్, ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుచేస్తున్నట్లు లోకేష్ ప్రకటించారు.

## తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోంది

-మొదటిపేజీ తరువాయి
తీర్థప్రసాదాలు అందజేశారు. క్షేత్ర నిర్వహణ అద్భుతంగా ఉందని మాంఝీ ప్రశంసించారు. "శ్రీవారి దివ్యమంగళ స్వరూపం దర్శించే భాగ్యం కలిగింది. తిరుమల వాతావరణం స్వర్గంలో విహరిస్తున్నట్లు ఉంది. ప్రపంచ నేతల మనసులు మారి శాంతిమార్గంలో నడిచేలా ప్రార్థించా."
కేంద్రమంత్రి మాంఝీని కలుసుకోవడం ఆనందంగా ఉంది: రాష్ట్రంలో ఏం.ఎస్.ఏం.ఈ శాఖలో మంచి విధానాలు తీసుకొచ్చేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్కీమ్స్ ఎలా అమలు అవుతున్నాయనే విషయాలను కేంద్రమంత్రి జితన్? రామ్? మాంఝీని అడిగి తెలుసుకున్నారన్నారు. ప్రజలను చైతన్యపరుస్తున్న కేంద్రమంత్రి మాంఝీని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.
"ఎంఎస్ఎంఈ శాఖలో మంచి విధానాల కోసం కేంద్రం, రాష్ట్రం పని చేస్తున్నాయి. కేంద్ర పథకాల అమలుపై కేంద్రమంత్రి జితన్‌రామ్ మాంఝీ అడిగి తెలుసుకున్నారు." - కొండపల్లి శ్రీనివాస్, మంత్రి
శ్రీవారిని దర్శించుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు: తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సినీ, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. శ్రీలంక డిప్యూటీ కమిషనర్ గణేశనాథన్ గేతీశ్వరన్, సంగీత దర్శకుడు తమన్, తమిళ నటుడు అథర్వ మురళీలు వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో వేర్వేరుగా పాల్గొన్నారు. ఆలయంలోకి వెళ్లిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని మట్నుక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారిని దర్శించుకున్న లోక్?సభ సభ్యుడు: శ్రీవారిని లోకసభ సభ్యుడు బిప్లబ్ కుమార్ దేబ్ దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ: తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. కంపార్టుమెంట్లు అన్నీ నిండి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్?లో వేచి ఉన్నారు. జులై 9వ తేదీ గురువారం 70,141 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,821 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే, గురువారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు సమకూరినట్లు వెల్లడించారు.

## మహిళలకు వెరీ 'గుడ్డు' ఉపాధి



-మొదటిపేజీ తరువాయి
మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం. దీనికోసం స్వయం సహాయక సంఘాలకు రుణాలతో పాటు ఉచితంగా యూనిట్లు కూడా అందిస్తోంది. తొలిసారిగా గుడ్లతో తయారు చేసే ఆహార వంటకాల యూనిట్లు విజయనగరం జిల్లాలో 40 మందికి ఇచ్చారు. రెండో దశలో 25 మందికి మంజూరు చేశారు. వీటితో అతివలు ఆర్థికంగా బలోపేతం అవుతుండడంతో మూడో దశలో మరో 55 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. వీటిని పీపీపీ విధానంలో ఎన్ఈసీసీ భాగస్వామ్యంతో అందజేస్తున్నారు. అర్హులను గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు.
వంటకాలు: షాహి అండా మాసాలా, గుడ్డు పచ్చడి, ఎగ్ ఫ్రైడ్ రైస్, ఎగ్ పెప్పర్ మసాలా, ఎగ్ రోల్, ఎగ్ నూడుల్స్?, ఎగ్ బిర్యానీ, ఎగ్ కర్రీ, ఎగ్ ఫ్రై, ఆమ్లెట్, ఎగ్ 65, ఎగ్ పరోటా, గోంగూర విత్ ఎగ్ కర్రీ, ఎగ్ దోశ, ఎగ్ బజ్జీ, ఎగ్ బోండా తదితర వంటకాలు చేసుకోవచ్చు.
పోషకాలెన్నో: గుడ్లు పోషకాలకు నిలయాలు. ఇందులో తొమ్మిది రకాల మాంసకృతులు, అమైనో ఆమ్లాలు, బీ కాంప్లెక్స్ విటమిన్లు, విటమిన్ డి, ఖనిజాలు దండిగా ఉంటాయి. శరీరంలోని వివిధ కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించడంతో పాటు పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. గుడ్డులోని ల్యూటిన్ అనే యాంటి ఆక్సిడెంట్ కంటి వ్యాధులు రాకుండా తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికి ఇది దోహదం చేస్తుంది. రోజుకు ఒక్క గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం తగ్గుతున్నట్లు ఇటీవల ఓ పరిశోధనలో తేలింది.
ఇంటిపట్టున ఉంటూనే ఆదాయం: ఇంటి వద్దనే ఆదాయం పొందడానికి ఈ వ్యాపారం ఎంతగానో దోహదపడుతుందని నెల్లిమర్లకు చెందిన పలువురు మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణంతో పాటు స్త్రీనిధి నుంచి మరికొంత తీసుకుని, కుటుంబ సభ్యుల సహకారంతో దీన్ని విస్తరిస్తామని యూనిట్లు నిర్వహిస్తున్న మహిళలు వివరిస్తున్నారు. రోజుకు ఖర్చులు పోనూ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఆదాయం వస్తోందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఇటువంటి వ్యాపారం వల్ల మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా వస్తుందని రేగిడికి చెందిన ఉపాధి పొందుతున్న మహిళలు తెలుపుతున్నారు. కావాల్సిన మొత్తం ముడి సరకులతో పాటు తయారు చేసే వస్తువులు కూడా ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇచ్చినట్లు వారు వివరిస్తున్నారు. తమలాంటి వారికి ఇవి ఎంతో ఉపయోగపడతాయని మహిళలు పేర్కొన్నారు.

# ఏపీలో మాటల మంటలు



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన చారిత్రాత్మక విజయంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన తరుణంలో.. రాష్ట్ర రాజకీయాలు మునుపెన్నడూ లేనంతగా వ్యక్తిగత దూషణలు, శాంతిభద్రతల సవాళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలు రగిల్చేందుకు, శాంతిభద్రతల సమస్యలను సృష్టించేందుకు ఒక పక్కా వ్యూహం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు టీడీపీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాయలసీమలోని రాప్తాడు ఫ్యాక్షన్ సెగల నుంచి కోస్తాలోని పెనుమలూరు పొలిటికల్ వార్ దాకా.. గత కొన్ని వారాలుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు కేవలం స్థానిక వివాదాలు కాదని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అభద్రతా భావాన్ని సృష్టించేందుకు ఒక పెద్ద పొలిటికల్ మైండ్ గేమ్ ఆడుతున్నారని అంటున్నారు. రాయలసీమ సున్నిత ప్రాంతాల్లో పాత కక్షలను మళ్లీ రగల్చడం. ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్ల పాటు అజ్ఞాతంలోకి వెళ్లిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హఠాత్తుగా తెరపైకి వచ్చి.. దివంగత నేత పరిటాల రవి, ప్రస్తుత మంత్రి పరిటాల సునీతలపై అత్యంత ఘోరమైన, వ్యక్తిగత పదజాలం ఉపయోగించడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ చరిత్ర ఉన్న అనంతపురం లాంటి జిల్లాలో ఇలాంటి ఉద్రేకం రేపే ప్రసంగాలు చేయడం వెనుక.. ఎలాగైనా స్థానిక కేడర్‌ను ఘర్షణల్లోకి నెట్టాలనే కుట్ర దాగుందని అనుమానిస్తున్నారు. కూటమి శ్రేణులు గనుక సహనం కోల్పోయి ఎదురుదాడి చేస్తే.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు, మాపై దాడులు జరుగుతున్నాయి అని దిల్లీ స్థాయిలో విక్టిమ్ కార్డ్ ప్లే చేసే వ్యూహంతోనే తోపుదుర్తి ఇలా రెచ్చగొడుతున్నారని అధికార పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. కృష్ణా జిల్లా కానూరు లో టీడీపీ జెండా దిమ్మెను ఉద్దేశపూర్వకంగా తొలగించిన వ్యవహారం దుమారం రేపింది. అమరావతిలోనూ వైసీపీ నేతల పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడింది. తమ నేతలపైనే దాడులు జరిగాయంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా రంగంలోకి రావడం ఈ పొలిటికల్ స్కెచ్‌లో భాగమేనని అంటున్నారు. ఏపీ రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని ఇతర రాష్ట్రాల యూట్యూబర్లు, సోషల్ మీడియా యాక్టివిస్టులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను టార్గెట్ చేస్తూ మహిళా నేతలపై అత్యంత జుగుప్సాకరమైన పోస్టులు పెట్టడం, విద్వేషాలను రేపడం పతాక స్థాయికి చేరింది. తాజాగా, దళిత క్రైస్తవ మీటింగుల ముసుగులో పవన్ కళ్యాణ్‌పై, రాజ్యాంగ వ్యవస్థలపై సాయుధ తిరుగుబాటును, నక్సల్స్ ఐడియాలజీని ప్రోత్సహిస్తూ వీడియోలు చేసిన వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ పై గన్నవరం పోలీసులు కఠినమైన ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించడం సంచలనంగా మారింది. ఈ అలజడి రాజకీయ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా కేవలం పరిపాలన, సంక్షేమంపైనే దృష్టి పెట్టి శాంతిభద్రతల విషయంలో కొంత ఉదారంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని భావిస్తున్న సీఎం చంద్రబాబు.. ఇప్పుడు హోం శాఖకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాజకీయ నాయకుల ముసుగులో ఉన్నా సరే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హయాంలో జరిగిన రాక్రీట్ అవినీతి అక్రమాలపై, ఆస్తుల సీజింగ్‌పై లీగల్ ఫోకస్ పెట్టడంతో పాటు.. సోషల్ మీడియా విద్వేషకులకు మద్దతుగా నిలుస్తున్న నటుడు ప్రకాశ్ రాజ్, వైసీపీ సోషల్ మీడియా వింగ్‌పై లీగల్ నోటీసులు, అరెస్టుల పరంపర ప్రారంభం కానుందని భావిస్తున్నారు. ఏపీ రాజకీయాలు ఇప్పుడు కేవలం అభివృద్ధి-సంక్షేమం అనే చర్చల నుంచి మారి, వ్యవస్థల పరిరక్షణ-శాంతిభద్రతల అదుపు అనే దిశగా సాగుతున్నాయి. ప్రతిపక్షం ఎంతలా రెచ్చగొట్టినా.. కూటమి ప్రభుత్వం చట్టపరమైన ఆంక్షలు, ఉపా లాంటి కఠిన నిబంధనల ద్వారా అరాచకాలను అణచివేసేందుకే మొగ్గు చూపుతోంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకోబోయే ఈ కఠిన చర్యలు అరాచక శక్తులకు అడ్డుకట్ట వేసి రాష్ట్రాన్ని ప్రశాంత మార్గంలో ఉంచుతాయా.. లేక ప్రతిపక్షం మరింతగా సెంటిమెంట్ పాలిటిక్స్ తెరపైకి తెస్తుందా అనేది వేచి చూడాలి

## ఏపీలో జనాభా వృద్ధి కార్యక్రమం...

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండి, కాన్పుల మధ్య కనీసం రెండేళ్ల విరామం పాటించిన దంపతులకు నగదు పురస్కారాలు అందించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 11వ తేదీ నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముగ్గురు పిల్లలున్న దంపతులను ప్రతి జిల్లాకు మూడు, అలాగే కాన్పుల మధ్య సరైన దూరం పాటించిన జంటలను ప్రతి జిల్లాకు ఆరు చొప్పున గుర్తించి రూ.5 వేల నగదు బహుమతి అందిస్తారు. ఒకవేళ అర్హులైన దంపతులు ఎక్కువగా ఉంటే లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తామని, అలాగే ఉత్తమ సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి కూడా పురస్కారాలు ఇస్తామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్ణయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదలపై చేసిన వ్యాఖ్యలకు అనుగుణంగా ఉందని చెప్పవచ్చు.

# ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు మంత్రి బిసీ జనార్ధన్ రెడ్డి పైఫైర్ అయిన కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె :జులై=10 ప్రజాజ్యోతి** బనగాన పల్లె పట్టణం వైఎస్సార్సీపీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్సీపీ నాయకులు బీవీ ప్రసాద్ రెడ్డి,అబ్దుల్ ఫైజ్,అంబటి రవి రెడ్డి,,సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి,సురేష్, ఖానిక్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ల పై ఫైర్ అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈనెల తొమ్మిదో తేదీన ముఖ్యమంత్రి పర్యటన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశాను అని చెప్పడం హాస్యాస్పదం.... ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్ కు కేంద్రం నుంచి 500 కోట్లు పారితోషికంగా పొందిన కూటమి ప్రభుత్వం... కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తె సూపర్ సిక్స్ అన్నావు...మరి ఎక్కడ ఉన్నాయి సూపర్ సిక్స్.... 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 1500 ఇస్తాను అన్నావు..1500 ఎక్కడ మరి..... ఉచిత సిలిండర్లు అన్నావు.... రెండేళ్ల ప్రభుత్వంలో ఒకే ఒక్కసారి ఇచ్చి మహిళలకు మోసం చేసిన చంద్రబాబు... ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి పాస్ బుక్ లు ఇచ్చావు... ఎక్కడ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశావు.. కేవలం మొదటి పేజీ మార్చి... నాడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పాస్ బుక్ లనే ఇచ్చావు.... బ్రిటిష్ కాలం నాటి సర్వే భూములను 2022 లో మొట్టమొదటి సారిగా ఈ సర్వే చేయించిన ఘనత మన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిది.... ల్యాండ్ టైటిల్ యాక్ట్ అని కేవలం ఓట్ల కోసం రైతులను సైతం ధగా చేసిన ఘనత చంద్ర బాబుది... రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 80 శాతం పనులు వైఎస్సార్సీపీ హయంలో జరిగింది... కేవలం 20 శాతం పనులను పూర్తి చేయలేక పోతున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం.. గొడ్డలి పార్టీ గురించి మీరా మాట్లాడేది... వైఎస్ వివేకానంద రెడ్డి గారిని చంపిన దస్తగిరిని ఎవరు కాపాడుతున్నారు.. నీకు వాదించే సిద్దార్థ లుథ్రా లాంటి లాయర్ దస్తగిరి కి ఎలా వాదిస్తున్నాడు ... వైఎస్ వివేకానంద రెడ్డి గారి హత్యకు కుట్రదారులు మీరు చంద్రబాబు.... రాయలసీమ ముఖ ద్వారం అయిన కర్నూలు జిల్లాలో గ్రీన్ కో ప్రాజెక్ట్ కు గ్రీన్ ట్రిబ్యునల్ కు వెళ్ళి అడ్డుపడ్డది మీరు కాదా చంద్రబాబు. జల యజ్ఞం ద్వారా రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి ఘనత... నాడు జలయజ్ఞాన్ని ధన యజ్ఞం అని చెప్పిన మీరు.... నేడు ఆ ప్రాజెక్ట్ లకు శ్రీకారం నేనే చేశాను అని చెప్పడం.. మీ విజ్ఞతకే వదిలివేస్తున్న టీడీపీ పార్టీ గొడ్డలి పార్టీ అని స్వయంగా ఒప్పుకున్న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి..... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దౌర్జన్యాలు,మహిళల పై అత్యాచారాలు ఎక్కువయ్యాయి.... ముచ్చుమర్రి సంఘటనలో ఇంతవరకు బాలిక ఆచూకీ కనుక్కోలేక పోయారు... మంత్రి గారి స్వగ్రామంలో 70 సంవత్సరాల దళిత వృద్ధ మహిళా పై అత్యాచారాం సంఘటన. నియోజకవర్గంలో పరిశ్రమలకు అడుగడుగున అడ్డుపడుతు న్నది నీవు కాదా.... అల్ట్రాటెక్, రాంకో పెట్నికోట,మై హోమ్ సిమెంట్ ఫ్యాక్టరీల ప్రజాభిప్రాయ సేకరణకు అడ్డుపడ్డది నీవు,నీ అనుచరులు కాదా.... రవ్వలకొండ మీద ఇప్పటికీ లీజులు లేకుండా అక్రమ మైనింగ్ చేస్తున్నది నీవు కాదా... మీరా రవ్వల కొండ మీద అక్రమ మైనింగ్ గురించి మాట్లాడేది. బనగానపల్లె బైపాస్ రోడ్డుకు నేను అడ్డుపడ్డాను అని నీవు అంటున్నావు....మా వైఎస్సార్సీపీ హయంలో బైపాస్ రోడ్డు లో భూములుం కొల్పోయిన్ రైతులకు 5 కోట్ల రూపాయల నష్టపరిహారం ఇప్పించింది నేను కాదా.....నంద్యాల – నొస్సం హైవే రోడ్డుకు 650 కోట్ల రూపాయలు నేను కాదా నిధులు మంజూరు చేయించి టెండర్స్ పూర్తి చేసినది.... సంజామల – ముదిగేడు రోడ్డుకు 12 కోట్ల రూపాయలు నేను కాదా నిధులు మంజూరు చేయించింది బనగానపల్లె వెంకటేశ్వర స్వామి ఆలయం. సంజామల మండలం పేరుసోముల గ్రామంలో 1 కోటి 85 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించింది నేను కాదా.... బనగానపల్లె పట్టణం బిసి హాస్టల్ కు 1 కోటి 65 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వంది....బిసి హాస్టల్ పనులను ఎందుకు పూర్తి చేయలేక పోతున్నావు... నీ పని తీరు గురించి ముఖ్య మంత్రే కితాబు ఇచ్చారు.... ఇంట గెలిచి రచ్చ గెలవాలని....ముఖ్యమంత్రికి రెండే రెండు వరాలు అడిగావు. ఒక్క వరాన్ని కూడా ప్రసాదించని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు

## అనారోగ్యంతో బాధపడుతున్న 8మంది సొంత నిదులతో ప్రతి నెల పెన్షన్ల అందిస్తున్న బీసీ ఇందిరారెడ్డి



**బనగానపల్లె :జులై=10 ప్రజాజ్యోతి** బనగానపల్లె నియోజకవర్గంలో, అనారోగ్యంతో బాధపడుతోన్న 8 మందికి, సొంత నిధులతో ప్రతి నెలా ఏడుగురికి రూ.3వేల మరియు ఒకరికి రూ.2 వేల చొప్పున పెన్షన్ అందిస్తోన్న మంత్రివర్యులు శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి బీసీ ఇందిరారెడ్డి. కైపాలో ముగ్గురు, సంకలాపురంలో ఇద్దరు, చెరువుపల్లెలో ఇద్దరు మరియు కొలిమిగుండ్లలో ఒక్కరు చొప్పున పెన్షన్ అందుకుంటున్నారు.

## పల్లెటూరి ప్రజలకు గుడ్ న్యూస్.. పాముకాటుకు ఇకపై108లోనూ మందు!




**బనగానపల్లె:జులై=10 ప్రజాజ్యోతి** పల్లెటూర్లో ప్రజలు ముఖ్యంగా రైతులకు ఎదురయ్యే ప్రమాదాల్లో ప్రముఖమైనది పాముకాటు. మన ప్రాంతాల్లో ఉండే అత్యంత విషసర్పాల్లో రెండు, మూడు రకాలే ఎక్కువగా మనకు ఎదురవుతుంటాయి.నాగుపాము, రక్తపింజరి, కట్లపాము ఈ మూడు పాముకాట్లే మనిషి ప్రాణాలను తీస్తుంటాయి. పాము కాటు వేసిన గంటలోపే ఆస్పత్రులకు వెళ్తే ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో మారుమూల గ్రామాల ప్రజలు సరైన సమయంలో ఆస్పత్రులకు వెళ్లలేక ప్రాణాలు కోల్పోతుంటారు. వారి కోసం ప్రభుత్వం ఇకపై 108లోనూ పాముకాటుకు మందును ఉంచింది.ప్రభుత్వం చేసిన ఈ కొత్త ఆలోచనతో ఎంతోమంది రైతులు, ప్రజలు సకాలంలో ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఎవరికి ఏ సమయంలో ప్రమాదం జరిగినా కొద్ది క్షణాల్లోనే 108 అక్కడ ఉంటుంది. ఈ 108లో ఎక్కువగా యాక్సిడెంట్ కేసులే వస్తుంటాయి. దానికి సంబంధించిన మందులే ఉంటాయి. అత్యవసర చికిత్స చేసేందుకు అనుకూలమైన విధంగా 108 వాహనాలను సిద్ధం చేశారు. ఇకపై అందులో పాముకాటు మందు కూడా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

## విద్యుత్ అంతరాయం



**కోవెలకుంట్ల:జులై=10 ప్రజాజ్యోతి** కోవెలకుంట్ల మరియు దొర్నిపాడు మండల విద్యుత్ వినియోగదారులకు తెలియ జేయడమేమనగా రేపు అనగా రెండవ శనివారం 11.07.2026 వ తేదీన 33/11కేవి కోవెలకుంట్ల ,కలుగొట్ల మరియు దొర్నిపాడు సబ్ స్టేషన్ పరిధిలో మరమత్తులు చేయడం జరగుతుంది కావున ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ అంతరాయము ఉంటుంది కావున మండల ప్రజలు అందరూ గమనించి సహకరించవలసినదిగా మనవి

# ఏజెన్సీ ప్రాంత వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన అక్రమ ప్రమోషన్లు రద్దు చేయాలి

### చేయకపోతే కలెక్టరేట్ మరియు డి యం హెచ్ ఓ ఆఫీసు మరియు ముట్టడి

### – ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్.



**కూనవరం జులై 10 ప్రజా జ్యోతి** ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులను కాలరాస్తు.. ఏజెన్సీ ప్రాంతంలో అమలులో ఉన్న జీవో నెంబర్. 68 కి విరుద్ధంగా ఈ నెల డియం హెచ్ ఒ ఆఫీస్ కాకినాడ నందు వైద్య ఆరోగ్య శాఖలో జనరల్ రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిలో గ్రేడ్ 3 ఏ యన్ యం (ఆడ) లకు గ్రేడ్ 2 ఏ యన్ యమ్ (ఆడ) లుగా ప్రమోషన్లు ఇచ్చారు. దీనివల్ల స్థానిక ఆదివాసీలకు ముఖ్యంగా స్థానిక ఆదివాసీ మహిళా ఉద్యోగులైన గ్రేడ్ 3 ఎ యన్ యమ్ లకు తీవ్ర అన్యాయం జరిగింది. పోలవరం జిల్లా వ్యాప్తంగా సుమారు 18 మంది కి పైగా గిరిజనేతర ఏ యన్ యమ్ లకు ఏజెన్సీ ప్రాంతంలో కి ప్రమోషన్ ద్వారా వచ్చారు. ఏజెన్సీ హక్కులు పటిష్టంగా అమలు చేయడం కోసం ప్రత్యేక ఏజెన్సీ జిల్లాలు ఏర్పాటు చేసిన కూడా మైదాన ప్రాంత విధానాలతో ఆదివాసీ హక్కులు కలరాస్తున్నారు. జోనల్ పోస్టుల ప్రమోషన్ లలో అమలవుతున్న 68 జి ఓ , లోకల్ క్యాడర్ పోస్టులైన గ్రేడ్ 3 ఎ యన్ యమ్ ల విషయంలో కాకినాడ జిల్లా అధికారులు అమలు చేయకపోవడం అనేది ఉద్దేశ్య పూర్వకంగా ఆదివాసీల హక్కులపై చేస్తున్న దాడిగానే భావిస్తున్నాం. వెంటనే ఏజెన్సీ ప్రాంతంలో చేపట్టిన ప్రమోషన్ ప్రక్రియను రద్దు చేసి, స్థానిక ఆదివాసీ మహిళా అభ్యర్థులతో బర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. అలా చేయని పరిస్తితిలో ఏ యన్ యమ్ లతో కలిసి కలెక్టర్ ఆఫీస్ మరియు డి యం హెచ్ ఓ ఆఫీసు ముట్టడి చేస్తామని హెచ్చరించారు ముట్టడికి ఐటిడిఎ రంపచోడవరం మరియు ఐటిడిఎ చింతూరు ఎ యన్ యమ్ లు అందరు సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చారు

## ఏ.ఎన్.కే. ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో డ్రాయింగ్ కార్యకలాపం




**కోవెలకుంట్ల:జులై=10 ప్రజాజ్యోతి** శుక్రవారం ఏ.ఎన్.కే. ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా డ్రాయింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులు తమ ఊహాశక్తికి రంగులు అద్దుతూ అందమైన చిత్రాలను గీశారు.డ్రాయింగ్ అనేది కేవలం బొమ్మలు గీయడం మాత్రమే కాదు, పిల్లల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని, ఏకాగ్రతను పెంపొందించే ఒక అద్భుతమైన కళ. ప్రతి విద్యార్థి తన ప్రతిభను చక్కగా ప్రదర్శిస్తూ ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకున్నారు. ఏ.ఎన్.కే. ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో విద్యతో పాటు విద్యార్థుల సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలలో కొత్త ఆలోచనలు, నైపుణ్యాలు పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయి.

## రైతులకు న్యాయం జరిగే వరకు భూమి ఉన్నవారికి పెన్షన్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి.



**రాయచోటి జూలై 10 ప్రజా జ్యోతి** భూమి ఉన్న రైతులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉన్న భూమిని మరొకరికి అమ్మినా, లేదా ఇతరుల పేర్లకు బదిలీ చేసిన సందర్భాల్లో కూడా సంబంధిత రైతుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు కొనసాగుతున్న కారణంగా అనేక మంది వృద్ధ రైతులు పెన్షన్‌కుదూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన రైతు వద్ద భూమి లేకపోయినా, రికార్డుల్లో పేరు ఉండటంతో అధికారులు పెన్షన్ మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు.అలాగే, అసైన్‌మెంట్ భూములు కలిగిన పలువురు దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్నప్పటికీ, రికార్డుల సమస్యల వల్ల సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల కారణంగా పేద రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిశీలించి, భూమి ఉన్న రైతుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వారికి ప్రత్యేక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని వంగిమల్ల రంగారెడ్డి కోరారు. అర్హులైన రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించి, అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం తరపున ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

### ప్రభుత్వ ఆసుపత్రిలో జనన ధ్రువీకరణ పత్రం కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి: మాజీ కౌన్సిలర్ అంజి



**గుంతకల్లు జూలై 10 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని శ్రీ చక్ర అపార్ట్మెంట్స్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుమ్ములూరు నారాయణ స్వామి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన నవజాతి శిశువుల కోసం జనన ధ్రువీకరణ పత్రాల కోసం వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తో మాట్లాడి ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని మాజీ కౌన్సిలర్ అంజి ప్రజా దర్బారులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాల కోసం అస్పత్రి సూపర్డెంట్ తో మాట్లాడి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల తో మాట్లాడి నేరుగా పరిష్క రించడం లేదా దీర్ఘకాలిక సమస్యలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేశారు. అలాగే మనమందరము కలిసికట్టుగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ తరపున నిలబడిన అభ్యర్థులను గెలిపించుకుని గుంతకల్లు నియోజకవర్గం నుండి నారా చంద్రబాబు నాయుడు కి బహుమతిగా ఇవ్వాలని అందుకోసం ప్రతి గ్రామంలో ప్రతి వార్డులో కూటమి నాయకులందరూ కలిసికట్టు గా పోరాడాలని ఈ సందర్భం గా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రాణాలకు ముప్పుగా కోళ్లపాడు వంతెన..! వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి





**కూనవరం, జూలై 10: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం కూనవరం భద్రాచలం ప్రధాన రహదారిపై ఉన్న కోళ్లపాడు వంతెన ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వంతెనకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడంతో భారీ గుంతలు ఏర్పడి, వాహనాల రాకపోకలకు తీవ్ర ప్రమాదం ఏర్పడింది.ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు, అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆర్ అండ్ బి శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వంతెనకు ఇరువైపులా మట్టి నింపి, రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## సిరివెళ్ల గ్రామపంచాయతీకి ఈవో నియామకంలో జాప్యం.. కారణాలేంటి?

ఈవో పోస్టింగ్ లేఖ వచ్చి పది రోజులు.. ఇంకా బాధ్యతలు స్వీకరించని అధికారి

సిరివెళ్ల ఈవో ఎప్పుడు?.. గ్రామస్థుల్లో పెరుగుతున్న సందేహాలు




**నంద్యాల (శిరివెళ్ల) ప్రజాజ్యోతి:జులై=10** సిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీకి ఈవో నియామకానికి సంబంధించిన లేఖ వచ్చి పది రోజులు గడిచినా ఇప్పటికీ అధికారి బాధ్యతలు స్వీకరించకపోవడంతో గ్రామంలో చర్చ జరుగుతోంది. ఈవో ఎప్పుడు బాధ్యతలు చేపడతారనే విషయంలో స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈవో పోస్టింగ్‌లో జాప్యానికి గల కారణాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయం వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే నియామక ప్రక్రియలో ఏవైనా పరిపాలనా కారణాలు ఉన్నాయా అనే విషయంపై అధికారిక వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా, నియామక ప్రక్రియకు సంబంధించి ఎవరైనా అక్రమాలు లేదా అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉంటే, వాటిపై సంబంధిత విచారణ సంస్థలు చట్టప్రకారం దర్యాప్తు చేసి వాస్తవాలను వెలికి తేయాలని స్థానికులు కోరుతున్నారు

## పాతపట్నం లో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్:-** యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించిన స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు .ఈ ప్రజా ధర్బార్ లో,25 వినతి పత్రాలు స్వీకరించారు .రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు,వృద్ధులు--వికలాంగులు--వితంతువుల వ్యక్తిగత వినతులు స్వీకరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, 15 రోజుల్లో పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## జనతా వారది అర్జీల పరిష్కారానికి పెద్ద పీట

జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** బీజేపీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనతావారది అర్జీల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు.ప్రజాసమస్యల పరిష్కరానికి జనతావారధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి జనతావారది ఒక వారధి అవుతామన్నారు. శ్రీకాకుళం జిల్లా బీజేపీ కార్యాలయం లో శుక్రవారం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లా ప్రజల సమస్యల పరిస్కారమే ద్యేయంగా జనతావారది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.ప్రజా సమస్యల ను తెలుసుకుని వాటి పరిష్కరానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో జనతా వారది కో కన్వీనర్ యర్రగుంట్ల జగన్మోహన్ , విజయనగరం ఓబీసీ మోర్చా జిల్లా ఇంచార్జ్ శ్రీ పసుపులేటి సురేష్ సింగ్ ,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావు , తదితరులు పాల్గున్నారు.


## సర్ ప్రక్రియలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి...దేశాయ్ ప్రహల్లాద ఆచారి



**కౌతాళం, జులై 10 ప్రజా జ్యోతి** గత రెండు రోజులుగా ఓటర్ జాబితసవరణ సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ప్రజలు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం వైస్సార్సీపీ మండల కన్వీనర్ దేశాయ్ ప్రహల్లాద ఆచారి తెలియజేశారు. గ్రామ సచివాలయం సిబ్బంది వారు ఓటర్లకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను సంబంధిత పత్రాలను తీసుకొని నమోదు చేస్తున్నారు.ఈ విధంగా తీసుకున్నవాటిని కొంతమంది సంబంధం లేని వ్యక్తులకు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.కాబట్టి గ్రామ ప్రజలు మరియు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి ప్రతి విషయాన్ని గమనిస్తూ ఎటువంటి పొరపాటు జరిగిన గ్రామ నాయకులకు గాని మండల నాయకులకు గాని సమాచారం అందించి ప్రజల ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని కోరారు.మరియు బిఎల్ఓ సంతకం చేసిన ఎన్యూమరేషన్ ఫారం ను తప్పకుండ ఓటర్లు బిఎల్ఓ వారి దగ్గర తీసుకోవాలని కోరారు.మండలంలో వైసీపీ నాయకులు బుత్ ఏజెశీట్లు బూత్ కన్వీనర్,బూత్ బి ఎల్ ఏ లు కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఏబీవీపీ 78వ సంస్థాపన దినోత్సవం,డోన్‌లో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం






**డోన్ (ప్రజా జ్యోతి)జూలై 10** డోన్అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డోన్ శాఖ ఆధ్వర్యంలో 78వ సంస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం ఇచ్చిన వారికి ఆర్టీవో క్రాంతికుమార్ సర్టిఫికెట్లు అందజేశారు, తరువాత ఆయనమాట్లాడుతూ, తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం డోన్ లో ఎంతో అభినందనీయమైన విషయమని పేర్కొన్నారు. ఏబీవీపీ కేవలం విద్యార్థి సంఘం మాత్రమే కాకుండా సమాజం, దేశం పట్ల బాధ్యత కలిగిన యువతను తీర్చిదిద్దే గొప్ప జాతీయ విద్యార్థి ఉద్యమమని అన్నారు. జ్ఞానం శీలం,ఏకత, అనే ఆదర్శాలతో విద్యార్థుల్లో సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తున్న సంస్థగా ఏబీవీపీ విశేష సేవలందిస్తోందని కొనియాడారు. తర్వాత 78వ సంస్థాపన దినోత్సవం సందర్భంగా ఆర్టీవో క్రాంతి కుమారుకు సంస్థాపకులు శాలువాకప్పి, మెమెంట్ అందజేశారు,ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ ఎస్ ఎఫ్ ఎస్ రాసి పోగుల రవిశేఖర్ మాట్లాడుతూ, 78వ సంస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని తలసేమియా చిన్నారులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, అయితే ఒక యూనిట్ రక్తం ద్వారా ఒక చిన్నారికి కొత్త జీవితం, ఒక కుటుంబానికి కొత్త ఆశ లభిస్తుందని పేర్కొన్నారు. అందుకే రక్తదానం, మహాదానం " అని పెద్దలు చెప్పారని తెలిపారు.రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రతి రక్తదాతను హృదయ పూర్వకంగా అభినందించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన కర్నూలు బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి శేఖర్,ముఖ్య అతిథులకు, కార్యకర్తలకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి జగదీశ్, చరణ్, కార్తీక్, అభినయ్, బీజేపీ నాయకులు సందు రమణ, బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ సొప్పాకుల, బీజేవైఎం నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.సమాజ సేవే లక్ష్యంగా, రక్తదానమే ప్రాణదానంగా భావిస్తూ ఏబీవీపీ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం యువతలో సేవా స్ఫూర్తిని మరింత పెంపొందించే కార్యక్రమంగా నిలిచింది. అని తెలిపారు,

## ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భానోజీ నాయుడు

- విద్యుత్ స్తంభాలు మరమ్మత్తులకు గురై ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఎమ్మెల్యే ,ఎంపీ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన భానోజీ
- తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి వెంకట భానోజీ నాయుడు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. రణస్థలం మండలం రణస్థలం గ్రామంలో మహంతి వీధి, గొర్లు వీధి, కాలనీలో ఎన్నో రోజులుగా విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో సమస్యను భానోజీ నాయుడు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్ప నాయుడు , స్థానిక శాసనసభ్యులు నడికుదుటి ఈశ్వర రావు దృష్టికి తీసుకువెళ్ళారు. వారు వెంటనే స్పందించి సంబంధిత శాఖ అధికారులకు సాధ్యమైన తొందరగా మరమ్మతులు చేయమని ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు శుక్రవారం నాడు విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయించారు.దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు, పిన్నింటి భానోజీ నాయుడికు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో ఎమ్మెల్యే కూన రవికుమార్ భేటీ

- స్వర్ణ ఆంధ్ర విజన్ తో గ్రామీణ ఉపాధి , చేతివృత్తుల అభివృద్ధిపై సార్థక చర్చ



**న్యూ డిల్లీ , ప్రజాజ్యోతి న్యూస్ :**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ని ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ న్యూ డిల్లీ లో కలిశారు. ఈ సందర్భంగా స్వర్ణ ఆంధ్ర విజన్ తో గ్రామీణ ఉపాధి , చేతివృత్తుల అభివృద్ధిపై చర్చా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ తో పాటు సహచర ఎమ్మెల్యేలు బుర్ల రామాంజనేయులు బండారు శ్రావణి పాల్గొన్నారు.ఈ సమావేశంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న "స్వర్ణ ఆంధ్ర" విజన్ అమలులో భాగంగా రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలను సంప్రదాయ కళలు, చేతివృత్తులు, కుటీర పరిశ్రమలను ఆధారంగా చేసుకుని ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు కేంద్రాలుగా ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై విస్తృతంగా చర్చించారు.గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడం, స్థానిక కళాకారులకు మార్కెట్ అవకాశాలు విస్తరించడం, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే మార్గాలపై సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు.రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం ఎంతో కీలకమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమలవుతున్న "స్వర్ణ ఆంధ్ర" విజన్ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కొత్త దిశను చూపుతుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు.

## శ్రీమాతా అన్నపూర్ణాదేవి విగ్రహం అభివృద్ధి నిమిత్తం 50 వేల రూపాయలు విరాళం.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** వృత్తి రిత్య జగదల్పూర్ లో ఉద్యోగం చేస్తున్నటువంటి డాక్టర్ శాసనపురి సాయి సంతోష్ తేజ మెడికల్ ఆఫీసర్ డిఫెన్స్ రీఛార్జ్ అండ్ డెవలప్మెంట్ అసోసియేషన్ జగదల్పూర్ o/శ్రీ మధుబాబు మహాలక్ష్మి బాలాజీ నగర్ వాస్తవ్యులు ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ నీలమణి దుర్గ ఆలయ అభివృద్ధి భాగంగా శ్రీ మాతా అన్నపూర్ణా దేవి విగ్రహం నిమిత్తం ఆలయ అభివృద్ధికి =o.50,000/- రూపాయలు విరాళాన్ని అందించారు వారికి గౌరవ శ్రీ మీూా మామిడి గోవిందరావు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు వారికి వారి కుటుంబ సభ్యులకు శ్రీ నీలమణి దుర్గమ్మ వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మా కమిటీ సభ్యులు ఆలయ అధికారులు సిబ్బంది కోరుకుంటున్నాం. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని ప్రార్థిస్తున్నాము.అక్కంద్ర సన్యాసిరావు చైర్మన్ మరియు కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది శ్రీ నీలమణి దుర్గ అమ్మవారు దేవస్థానం పాతపట్నం.

## కర్నూల్ జిల్లాలోని ఎస్ఎస్ ట్యాంకులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలి...

బి.మాబుసాబ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ



**కౌతాళం,జులై 10 ప్రజా జ్యోతి** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ మైనారిటీ సెల్ జాయింట్ సెక్రెటరీ బి.మాబుసాబ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాల్లో ఎలీనో ప్రభావంతో తుంగ భద్ర ఎల్ ఎల్ సి కాలువ పరిధిలోని ఎస్ ఎస్ ట్యాంకులు నీళ్లు లేక బోసిపోతున్నాయని పేర్కొన్నారు.అలాగే జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల కరువుకాటకాలతో ప్రజలకు మూగజీవాలకు వంకల్లో కూడానీళ్లు లేక మూగ జీవాలు అలమటిస్తున్నాయని పేర్కొన్నారు.ఎస్ ఎస్ ట్యాంక్ లో నీళ్లు లేక ప్రజలు,మూగ జీవాలు నానా అవస్థలు పడుతున్నారని కావున కూటమి ప్రభుత్వం దీనిపై స్పందించి కాల్వ పరిధి లోని ప్రజలకు తాగునీటిని అందించి ఆదుకోవాలని విన్నవించారు.ఈ విషయంపై కూటమి ప్రభుత్వ నాయకులు, జిల్లా కలెక్టర్ మరియు నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే టీబీ డ్యాం అధికారులకు ఇండెంట్ పంపించి ఎస్ఎస్ ట్యాంకులను నీటితో నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని బి.మాబుసాబ్ పేర్కొన్నారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేనున్న ఎమ్మెల్యే బీవీ



**నందవరం జులై 10 (ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలో నిర్వహించబడనున్న "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహా విష్కరణ" మహోత్సవంలో ఎమ్మిగనూరు శాసన సభ్యులు డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలని పిలుపునిచ్చారు.

# విజయవంతంగా ముగిసిన రాజ్య పురస్కార్ తృతీయ సోపాన్ పరీక్షలు

**నంద్యాల మహానంది గోపవరం ప్రజాజ్యోతి:జులై=10** మహానంది(గోపవరం): నంద్యాల జిల్లా మహానంది మండలం మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భారత్ స్కౌట్స్ మరియు గైడ్స్ వారి ఆధ్వర్యంలో రాజ్యపురస్కార్ గవర్నర్ అవార్డు మరియు తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులు నిర్వహించబడ్డాయి.ముఖ్య అంశాలు:శిక్షణ: ఈ క్యాంపులో గైడ్ విద్యార్థినులకు క్రమశిక్షణ, దిక్సూచి వాడకం, ఫ్లాగ్ హోయిస్టింగ్, టెంట్లు నిర్మించడం, అంచనా వేయడం (అంచనా), ప్రథమ చికిత్స మరియు ముడులు వేయడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.శిక్షణతో పాటు పరీక్షలు నిర్వహించి తృతీయ సోపాన్ టెస్ట్ మరియు రాజ్య పురస్కార్ పరీక్షలు కూడా నిర్వహించారు.ముఖ్య అతిథులు:జిల్లా కార్యదర్శి మరియు జిల్లా కమిషనర్ పి. జనార్ధన్ రెడ్డి.జిల్లా సెక్రటరీ తూర్పు లింగారెడ్డి.రాజ్య పురస్కార్ పరీక్షల నిర్వహణకు ఎన్. భారత్ మాత (ఎల్ టీ జి) విచ్చేశారు.తృతీయ సోపాన్ నిర్వాహకులుగా యు. సువర్ణ కుమారి వ్యవహరించారు.ఈ కార్యక్రమానికి వసతి కల్పించిన గోపవరం హై స్కూల్ హెడ్ మాస్టర్ హేమలతకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ క్యాంపు గైడ్ కెప్టెన్లు ఆధ్వర్యంలో విద్యార్థినుల సమక్షంలో విజయవంతంగా ముగిసింది.రాజ్యపురస్కార్ క్యాంప్ఈ శిబిరానికి 18 మంది విద్యార్థినులు హాజరయ్యారు.తృతీయ సోపాన్ క్యాంప్ శిబిరానికి 39 మంది విద్యార్థినులు హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో (పాణ్యం) ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్, పాణ్యం.కె జి బి వి శిరివెళ్ల) కె జి బి వి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, శిరివెళ్ల.ఏ పీ ఏ పి ఎం ఎస్ (డోన్) – ఆంధ్రప్రదేశ్ మోడల్







స్కూల్, డోన్. (మిద్దూరు) కె జి బి వి మిద్దూరు.ఏ పీ ఎం ఎస్ (జుపాడు బంగ్లా) ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్, జుపాడు బంగ్లా.జడ్పీ హెచ్ ఎస్ (గర్ల్స్ డోన్) – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల), డోన్.ఈ పాఠశాలలన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల మరియు కర్నూలు జిల్లాలకు చెందినవి. ప్రస్తుతం జూలై 2026లో కూడా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాజ్యపురస్కార్ మరియు తృతీయ సోపాన్ పరీక్షా శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.

## రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు
- రైతుల సంక్షేమం ,వ్యవసాయాభివృద్ధికి దోహదపడే విధానాలపై విస్తృత చర్చ
- న్యూఢిల్లీ లో జాతీయ స్థాయి వర్క్ షాపు లో పాల్గొన్న రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్, ఎమ్మెల్యే కూన రవికుమార్

**న్యూ ఢిల్లీ , ప్రజాజ్యోతి న్యూస్:**దేశ వ్యవసాయ రంగం భవిష్యత్తు, భూ పరిపాలన, నీటి వనరుల సమర్థ వినియోగంపై లోతైన చర్చలు జరిపే లక్ష్యంతో న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ శుక్రవారం నాడు పాల్గొన్నారు.ఈ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధకులు పాల్గొని వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, వాటికి సాధ్యమైన పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు.ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనుసరించాల్సిన విధానాలు, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరువ చేయడం, భూ పరిపాలనలో పారదర్శకత, నీటి వనరుల సమర్థ నిర్వహణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యవసాయ విధానాలపై నిపుణులు తమ అభిప్రాయాలను





వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి దోహదపడే విధానాలపై జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ విలువైన వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, వాటిలో ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే అంశాలను రాష్ట్రంలో అమలు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.రైతుల అభ్యున్నతే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు శాస్త్రీయ పద్ధతులు, సాంకేతికత, సమర్థవంతమైన నీటి నిర్వహణ, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరహా జాతీయ స్థాయి చర్చలు ప్రజాప్రతినిధులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తు విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# నాలుగు కోట్ల రూపాయలతో మస్తానవలి దర్గా సమగ్ర అభివృద్ధి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు జూలై 19 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన 391వ వార్షిక ఉరుసు మహోత్సవం సందర్భంగా హజరత్ మస్తానవలి దర్గా స్వామి వారిని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ హజరత్ మస్తానవలి దర్గాను రూ.4 కోట్లతో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ దర్గా ఎంతో



పురాతనమైనదైనా, గత పాలకులు ఉరుసు సమయం లో వచ్చి దర్శనం చేసుకోవ డం తప్ప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టలేదన్నారు. ప్రస్తుతం ఈ దర్గా వక్ఫ్ బోర్డు ఆధీనం లో ఉందని, ఇటీవల వక్ఫ్ బోర్డు చైర్మన్‌తో మాట్లాడగా ప్రధాన గర్భాలయ అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు, పూర్తి స్థాయి మౌలిక వసతులతో కలిపి మొత్తం రూ.4 కోట్ల అవసరం ఉందని వివరించార ని తెలిపారు. ఇప్పటికే దర్గా అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు ఖాతాలో ఉన్న రూ.60 లక్షలను వినియోగిస్తూ, అటాచ్డ్ బాత్‌రూమ్‌లతో కూడిన వసతి గదుల నిర్మాణం చేపట్టాలని అధికా రులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మొదటి దశలో రాజస్థాన్ మార్బుల్‌తో ప్రధాన గర్భాలయాన్ని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతా మని, అనంతరం కాంపౌండ్ వాల్, తాగునీటి సౌకర్యం, బాత్‌రూమ్‌లు, వసతి గదులు తదితర కనీస సౌకర్యాలన్నిం టినీ కల్పిస్తామని వెల్లడించారు. టీవల వైరల్ అయిన ఆడియో కాల్‌పై స్పందిస్తూ తాను చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షం వక్రీకరించిందని అన్నారు. దర్గా అభివృద్ధికి నిధుల కేటాయింపుపైనే మాట్లాడానని, ప్రజలకు వాస్తవం తెలుసని స్పష్టం చేశారు. కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం అభివృద్ధి తరహాలోనే మస్తాన్ వలీ దర్గాను కూడా రాబోయే రెండు సంవత్సరాల్లో ఆదర్శ దర్గాగా అభివృద్ధి చేస్తామని మైనారిటీ సోదరులకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి సంవత్సరం వేలాదిగా వచ్చే భక్తులు, అలాగే మస్తానప్ప, మస్తాన య్య, మస్తాన్ బీ వంటి పేర్లతో స్వామివారి ఆశీస్సులను స్మరించుకునే భక్తులందరూ దర్గా అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు.

## స్కూల్ పిల్లలకు కంప్యూటర్స్ మరియు బ్యాగ్స్ లు టెలిజన్ అందజేశారు

**బనగానపల్లె (అవుకు) ప్రజాజ్యోతి:జులై=10** అవుకు మండలం కొండనాయన పల్లి గ్రామంలో ఎఎంపిఐఎన్ సోలార్ ఎనర్జీ వారి సహకారంతో ప్రాథమిక ఉన్నత పాఠశాల లో ఉన్న విద్యార్థులకి కంప్యూటర్స్ ఉ టెలివిజన్ మరియు స్కూల్ బ్యాగ్స్ ఉ క్యారీ బ్యాగ్స్ అందజేశారు ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా అవుకు మండల టిడిపి అధ్యక్షుడు ఉగ్ర సేనా రెడ్డి మరియు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు....



## ఉమ్మడివరంలో డెంగ్యూ నివారణకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు!..

డీఎండహెచ్.వో,చరిత ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే!.. వైద్యశిబిరం,ఫాగింగ్,లార్వా నిర్మూలన చేపట్టిన అధికారులు!..




**వి.ఆర్.పురం,జూలై 10(ప్రజాజ్యోతి ప్రతినిధి)**వరరామచంద్రాపురం, మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో,జ్వరాల నివారణ, దోమలద్వారావ్యాపించే వ్యాధులనుఅరికట్టేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ శుక్రవారం విస్తృత చర్యలు చేపట్టింది.జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. చరిత,డిప్యూటీ డీఎండహెచ్.ఓ,డాక్టర్ ప్రశాంతి, జిల్లా మలేరియా అధికారి,డాక్టర్ భాస్కర్‌రావు,గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈసందర్భంగా గ్రామంలో ఇంటింటి జ్వరసర్వే నిర్వహించి జ్వరలక్షణాలు ఉన్న వారినిగుర్తించారు.దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తిస్తూ లార్వా నిర్మూలన కార్యక్రమం,ఇండోర్ స్ప్రే చేపట్టారు.గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు చెరువుల్లో దోమలనివారణ కోసం ఆయిల్ బాల్స్ వేశారు. సాయంత్రంవేళ గ్రామమంతా ఫాగింగ్ నిర్వహించి దోమల నియంత్రణ చర్యలను మరింత వేగవంతంచేశారు.గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో మొత్తం 43 మందికి సేవలు అందించారు.జ్వరంతో బాధపడుతున్న 7 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.అవసరమైన వారికి ఆరోగ్య సూచనలు కూడా అందించారు.జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని,ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండాచూసుకోవాలని,దోమల నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని వైద్య అధికారులు గ్రామస్థులకు సూచించారు. స్థానిక ప్రజలు కూడా వైద్యశాఖ చేపట్టిన దిద్దుబాటుచర్యలకు సహకరించాలని అధికారులు కోరారు.ఈకార్యక్రమంలో స్థానిక డాక్టర్ నీలుఫర్,ఆయుర్వేద డాక్టర్ స్వర్ణలత,హెల్త్ అసిస్టెంట్లు,ఏ.ఎన్, ఎం,లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 4.కోట్ల రూపాయలతో బీ.టీ రహదారి పనులకుశంకుస్థాపన.

**– 10.గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు**



**అనంతగిరి మండలం. జులై 10. ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామ రాజు జిల్లా.అనంతగిరి మండలంలోని పైనంపాడు పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాల దశాబ్దాల రవాణా కష్టాలకు త్వరలోనే విముక్తి కలగనుంది. ఎగువ సొనభ గ్రామం నుంచి కాకరపాడు గ్రామం వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీ.టీ రహదారి పనులను స్థానిక ఎం.పీ.టీ.సీ వంతల తమ్మన్న ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎం.పీ.టీ.సీ తమ్మన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్మన్ నిధుల నుంచి సుమారు 4. కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు పనులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సరికొత్త బీ.టీ రహదారిఅందుబాటులోకి రావడం వల్ల ఎగువ సునభ, కాకరపాడు సహా చుట్టుపక్కల ఉన్న దాదాపు 10. గిరిజన గ్రామాలకు శాశ్వతంగా రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు వెళ్లడానికి గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కొర్రా తమ్మన్న, టీ.డీ.పీ పంచాయతీ గ్రామ కమిటీ ప్రతినిధి మరియు మాజీ వైస్ ఎం.పీ.పీ సిదారి గుండన్న, బోయిని బొంజుబాబు, కన్వీనర్ కిముడు సుబ్బారావులతో పాటు స్థానిక టీ.డీ.పీ, వై.సీ.పీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కౌతాళం మండలం తెదేపా అధ్యక్షులు సురేష్ నాయుడు

**కౌతాళం, జులై 10 ప్రజా జ్యోతి** గురువారం రోజున కౌతాళం మండలం కుప్ప గల్ రైల్వే గేటు సమీపంలో కౌతాళం మండల కేంద్రాని కి చెందిన బోయ నర్సిరెడ్డి ప్రమాదవశత్తులో గుర్తుతె లియని వాహనం ఢీకొట్టి మరణించడం జరిగినది. విషయం తెలుసుకున్న యువ నాయకులు సురేష్ నాయుడు రాత్రి తీవ్ర దిగ్భ్రాంతికి వ్యక్తం చేస్తూ శుక్రవారం రోజున ఉదయం నుంచి ప్రభుత్వం ఆసుపత్రిలో ఉండి సంఘ టన గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేకూరే దిశగా పెద్దతుంబాళము పోలీసు అధికారులతో మాట్లాడి వాహనాన్ని గుర్తించాలని





కోరుతూ కుటుంబానికి న్యాయం చెయ్యాలని పోస్టుమార్టం అయ్యేంత వరకు దగ్గర ఉండి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ తగిన ఆర్థిక సహాయం అందచేసి మృతదేహానికి నివాళులు అర్పించారు.అనంతరం కుటుంబానికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న నర్సిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం చేత వచ్చే ప్రయోజనాలు చేకూరే వరకు అండగా ఉంటానని కుటుంబానికి ధైర్య బరోసాన్ని కలిగించారు.అనంతరం హల్వి గ్రామ తెదేపా సీనియర్ నాయకులు హల్వి సిద్ధప్ప సోదరులు ఎన్.ప్రహ్లాద్ తాతా అనారోగ్యంతో మృతి చెందారు. ప్రహ్లాద్ తాతా గారి మృత దేహానికి నివాళులు అర్పిస్తూ శాంతిని కాంక్షించారు.

## ఎస్ ఐ ఆర్ - పై అవగాహన కార్యక్రమం



**వేలేరుపాడు : 10 జూలై వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ ( శివరామ్ )** ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ కే, వెట్రిసెల్వి ఆదేశాల మేరకు శుక్రవారం రోజున సాయంత్రం 04.00 గంటలకు ప్రస్తుతం జరుగుచున్న -2026 కార్యక్రమంపై వేలేరుపాడు మండలంలోని రాజకీయ ప్రతినిధులు (అధ్యక్షులు/కార్యదర్శులకు), బి ఎల్ ఏ లు మరియు బి ఎల్ వో లకు స్థానిక వెలుగు కార్యాలయం నందు సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ చివరి దశకు వచ్చినందున ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లు వెంటనే మీ బి ఎల్ వో లకు ఇచ్చి మ్యాపింగ్ చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు , అలాగే మరణించిన వారి వివరాలు కూడా బి ఎల్ వో లకు వారి యొక్క మరణ ధ్రువ పత్రాలను ఇవ్వాలని అన్నారు,రెండు ఓట్లు నమోదు కాబడిన వారి వివరాలు, ఊరిలో లేని వారి వివరాలను మండలములోని 22 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బి ఎల్ వో లు సమావేశంలో చదివి వినిపించడం జరిగిందన్నారు,ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ ఎన్ శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలియజేసారు,ఈ కార్యక్రమం లో టీడీపీ, జనసేన, బీజేపీ,వైసీపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## వర్షం కోసం శ్రీ మారెమ్మ దేవికి 101 బిందెలు నీళ్లు



**కౌతాళం జూలై 10 ప్రజా జ్యోతి** కౌతాళంలో రైతులు వేసిన పంటలకు వర్షం రావాలని కోరుతూ కౌతాళంలో వెలిసిన ఎస్సీ కాలనీలో శ్రీ మారెమ్మ దేవి పాదాలకు 101 బిందెలు నీళ్ళు మోసే కార్యక్రమం అక్కడ ఉన్న దేవాలయ పెద్దలు చేపట్టారు.దేవాలయ పెద్దలు పిలుపుమేరకు కౌతాళం ఆశీర్వాదాలు తీసుకొని మరియు రైతులకు మంచి వర్షం కురవాలని మంచి పంటలు రావాలని కోరుకున్నారు మరియు కౌతాళంలో కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్వామి మాజీ సర్పంచ్ అవతారం మాజీ సర్పంచ్ పాల్ దినకర్,మరియు గుడి పెద్దలు యస్. లింగన్న,ఎం. కాలయ్య,ఎం.ఎల్లప్ప యస్.ఈరన్న, కె.నూకయ్య,బి.చిన్న బి.వెంకటేష్, సుంకేసుల,ఈరన్న యస్.ఎంకప్ప,యం. పరసప్ప,యస్. పర్సప్ప కార్యకర్తలు అక్కడున్నా దేవాలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్త ఆగ్రహం వ్యక్తం చేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



**తాళ్లపూడి ,జూలై 9 ,ప్రజాజ్యోతి న్యూస్** జనతా వారిది కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం నుండి అన్నదేవర పేట మరియు తిరుగుడుమెట్ట వెళ్లే రోడ్డు పై వేగేశ్వరపురం గ్రామంలో ఉన్న చెత్తను వేయడం వలన రైతులు మరియు గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిసరాలు శుభ్రత విషయంలో పంచాయతీ అధికారులు నిద్రపోతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల వద్ద పూర్తిగా తాగుబోతుల అడ్డగా మారిందని అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ పనులు నిమిత్తం ఇటు వైపుగా వెళుతున్న రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి, దీనిపై రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు బూసి సురేంద్ర నాథ్ బెనర్జీ, జిల్లా మరియు మండల నాయకులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## అమృత మూర్తి పుట్టా పోలమ్మ కు అశ్రునివాళి



**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి జూలై 10** మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి శ్రీమతి పుట్టా పోలమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పీ.ఆర్.కే. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు అనగా శుక్రవారం ఉదయం కన్నుమూశారు.ఈ సందర్భంగా శ్రీమతి పుట్టా పోలమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. అలాగే గౌరవ ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ పరమాత్మ ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము. అలాగే శుక్రవారం పుట్టా పోలమ్మ గారి పార్థివ దేహం రాత్రి 8 గంటలకు ప్రొద్దుటూరు లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకొనుంది. అలాగే రేపటి రోజు అనగా శనివారం 11 గంటలకు ప్రొద్దుటూరు లోని ఎమ్మెల్యే స్వగృహం నుండి అంతిమయాత్ర ప్రారంభమై మదూరు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు .

# అరుణోదయ సాంస్కృతిక ఉద్యమ నాయకుడు కామ్రేడ్ నాగన్నకు విప్లవ జోహార్లు




**గుంతకల్లు ప్రతినిధి జూలై 10 (ప్రజా జ్యోతి):** అనంతపురం రూరల్ పరిధిలో కక్కలపల్లి గ్రామం కామ్రేడ్ రఫూఫ్ కాలనీలో శుక్రవారం సాయంకాలం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ అరుణోదయ సంస్కృత సమాఖ్య రాష్ట్ర నాయకులు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ నాగన్న ఈనెల మూడో తారీఖున ఖమ్మంలో అనారోగ్యంతో మరణించడం జరిగినది. అందుకు శుక్రవారం వారికి సంస్మరణ సభను నిర్వహించడం జరిగినది. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివా ళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి, అరుణోద య కామ్రేడ్ నాగన్న కు విప్లవ జోహార్లు , ప్రజా కలలు వర్ధిల్లాలి, ఫాసిస్ట్ ప్రభుత్వాల కు వ్యతిరేకంగా పోరాడుదాం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వర్ధిల్లాలి, అమరవీరుల ఆశయాలను కొనసాగి ద్దాం నినాదాలు చేయడం జరిగినది. అరుణోదయ జిల్లా నాయకులు ముత్యాలు, రాజేష్ , ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి బి. సురేష్ మాట్లాడుతూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వ్యవస్థాపక సభ్యులుగా ఉంటూ గత 50 సంవత్సరాలుగా అరుణోదయ సాంస్కృ తిక ఉద్యమం, విప్లవ ఉద్యమంలో కొనసాగుతూ పీడిత ప్రజల గొంతునై ప్రజల వానిని పాటల రూపంలో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ముందు వరుసలో ఉండేవారు. ఆయన ఎమర్జెన్సీ కాలంలో కూడా పార్టీలో పని చేయడం జరిగినది. ఆయన విప్లవ ఉద్యమంలో అనేక ఆటుపో ట్లకు ఆర్థిక ఇబ్బందులకు గురి అయిన ఎక్కడ రాజకీయంగా బలహీన పడకుండా రాజకీయ చైతన్యంతో పార్టీ సిద్ధాం తాన్ని ఆశయాలను మరణించేవరకు ఆచరించి కొనసాగ డం జరిగినది. ఆయన మరణం అరుణోదయ సాంస్కృతిక ఉద్యమానికి, విప్లవ ఉద్యమానికి తీవ్ర నష్టం ఆయన ఆశయాలను మనం అందరం ముందుకు తీసుకెళ్లడం ద్వారానే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారము అవుతామని తెలపడం జరిగినది. ఐ ఎఫ్ టి యు నగర అధ్యక్షులు దావీద్ , ఐ7 ఎఫ్ టి యు నగర ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతి సమాఖ్య కమిటీ సభ్యులు అనిల్, వన్నూర్, గౌతమి, ఉమాదేవి, జయమ్మ, ఎఫ్ టి యు కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, నరసప్ప, కదిరప్ప, రామంజి, రామచంద్ర, దాదుబీ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి దిశగా తాడిపూడి సొసైటీ బాధ్యతలు చేపట్టి దిగ్విజయంగా ఏడాది పూర్తి



**సొసైటీ ద్వారా వచ్చే జీతాన్ని ప్రజా సేవకే ఖర్చుపెడుతున్న అధ్యక్షులు నామా కొండబాబు**





**తాళ్లపూడి, జులై 10, ప్రజాజ్యోతి న్యూస్** రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తాడిపూడి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి దిగ్విజయంగా మొదటిసంవత్సర పాలన పూర్తిచేసిన సొసైటీ అధ్యక్షులు నామా వెంకట సుబ్బారావు (కొండబాబు)అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నాటి నుంచి “పారదర్శకత, రైతు నేస్తం” అనే నినాదంతో సొసైటీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారు.

**తొలి సంవత్సరంలో సాధించిన కొన్ని ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు**

1. ఎరువులు బస్తాలు మొదలైనవి నిల్వ ఉంచే సొసైటీ గోడౌన్ చాలా ఏళ్ల క్రితం పాడవడంతో వెంటనే యుద్ధ ప్రాతికపై మరమత్తులు చేయించడం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది 2. రైతులకు రుణాలు పంపిణీలో వేగం పంట రుణాల మంజూరులో ఆలస్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణాలను మంజూరు చేయడంలో కృషి 3. రైతుల ఆరోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం రైతు బాగుంటేనే దేశంబాగుంటుంది అనే ఉద్దేశంతో సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు, గ్రామస్తులకు ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి టెస్టులు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ 4. సుమారు 50 లక్షల రూపాయలు డిపాజిట్లు సేకరించడంలో ప్రత్యేక చొరవ 5. లాకర్లను ఏర్పాటు చేయించి వినియోగంలోకి తీసుకురావడం 6. రైతుల పండించిన ధాన్యాన్ని నేరుగా సొసైటీ ద్వారా కొనుగోలు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీ ధరలకు అందించి రైతులు మధ్య దళారీ వ్యవస్థను లేకుండా అరికట్టడం 7. యూరియా తదితర ఎరువుల కోసం రైతులకు ఇబ్బంది లేకుండా అందుబాటులో ఎరువుల నిల్వలు ఉంచడంలో కీలక పాత్ర పోషించారు 8. సొసైటీ కివెళ్లే రోడ్డు డ్రైనేజ్ జెడ్పీ గ్రాంట్ నిధులతో నిర్మాణం 9. ఆధునిక సాగుపై అవగాహన డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయంపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగాసొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ కొండబాబు మాట్లాడుతూ “రైతే రాజు అనే స్ఫూర్తితో సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని నాపై ఎంతోనమ్మకం తో ఈ బాధ్యతను అప్పచెప్పిన నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు ఆంధ్ర షుగర్స్ జేఎండి పెండ్యాల అచ్చిబాబు కి మరియు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కి అలాగే రైతులకు, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలుపుతూ రైతుల సహకారంతో సొసైటీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో సొసైటీ అభివృద్ధి ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు

# మస్తానయ్య దర్గా విషయం లో నాపై వచ్చిన ఆరోపణలు నిజం అని నిరూపిస్తే గుంతకల్లు వదిలిపోతా :ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు జులై 10 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి శుక్రవారం గుంతకల్లు పట్టణం నందు ప్రసిద్ధి చెందిన మస్తానయ్య దర్గా ను దర్శించుకుని ప్రత్యేక చదివింపులు చదివించారు. మస్తానయ్య దర్గా ఉరుసు సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది అని తెలిపారు, మస్తానయ్య దర్గా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇటీవల గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పై వైసీపీ నాయకు లు ముస్లిం సోదరులతో మాట్లాడిన వాయిస్ రికార్డు ను వక్రీకరించి దాన్ని వైరల్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తాను గుంతకల్లు నియోజకవ ర్గంలోకి అడుగు పెట్టి 30 రోజు ల్లోనే గెలవడంలో ఆ నెట్టికంటి ఆంజనేయస్వామి వారి కృప మరియు మస్తానయ్య స్వామి వారి కృప ఖచ్చితంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటివరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులు వచ్చారు వెళ్లారు కానీ మస్తానయ్య దర్గాను అభివృ ద్ధి చేసిన దాఖలాలు ఎక్కడా లేవు కానీ స్వామి వారి కృప తో ఆ కార్యక్రమాన్ని తాను పూర్తి చేయాలని సంకల్పంతో ఆరోజున వక్ఫ్ బోర్డ్ వారితో మాట్లాడి రెండున్నర కోట్ల రూపాయలతో దర్గాను అభివృద్ధి చేయాలని సూచిం చడం జరిగిందని అందులో భాగంగానే ఒక ముస్లిం నాయకుడితో తాను వక్ఫ్ బోర్డు వారు వస్తున్న సందర్భంగా అందులో 60 శాతం దర్గా అభివృద్ధికి మరియు 40 శాతం వక్ఫ్ బోర్డు వారు తీసుకునే విధంగా మాట్లాడితే దాన్ని కొంత మంది వైసిపి నాయకులు వాయిస్ రికార్డును వక్రీక రించి తనకు 60 శాతం వాటా ఇవ్వాలని దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడం జరిగిందని మీకు సిగ్గు లజ్జ ఏమైనా ఉంటే నేను మాట్లా డిన మాటలు నిజమని నిరూపిస్తే ఈ గుంతకల్లు నియోజకవర్గం వదిలి వెళ్లిపోతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సవాల్ చేశారు దర్గాని అభివృద్ధి చేద్దాం అనే ఆలోచనతో ఉన్న తనకు అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని ఏది ఏమైనా ప్రజలు నాకు అండగా నిలబడి ఈ దుష్ప్రచారాలను తిప్పి కొట్టడం చాలా సంతోషంగా ఉందని అలాగే ఎవరు ఎన్ని అసత్య ఆరోపణలు చేసిన కచ్చితంగా మస్తాన య్య దర్గాను అభివృద్ధి చేసి చూపిస్తామని అందుకు గుంతకల్లు నియోజకవర్గం ప్రజలు నాకు అండగా ఉన్నారని ఎవరు ఎన్ని కుట్రలు పన్నిన ప్రజలే చూసుకుంటారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేశారు అలాగే ఎంతో ప్రసిద్ధి చెందిన మస్తానయ్య దర్గాలో వచ్చే భక్తులకు కనీసం సౌకర్యాలు సరిగా లేవని కాబట్టి రెండు న్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు మొదలుపెడితే మరొక కోటి 50 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులు మరియు గుంతకల్లు నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ క్యాంపులును సందర్శించిన ఆర్డిఓ ఏ బి ఎస్ బి ఎస్ శ్రీనివాస్



**గుంతకల్లు జులై 10 (ప్రజా జ్యోతి):** ఆర్డిఓ ఏ బి ఎస్ బి ఎస్ శ్రీనివాస్ ఎస్ ఐ ఆర్ క్యాంపులు సందర్శించడంలో భాగంగా శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని అంబేద్కర్ నగర్ నాలుగో వార్డ్ సచివాలయం ను సందర్శించారు. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ గణన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి అర్హుడైన ఓటర్ లిస్టు జాబితాలలో ఉండేలాగా చూడాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్స్ కి అవగాహన లేక వారి యొక్క ఓటును కోల్పోతే రాబోయే తరంలో పూర్తిగా ఇబ్బంది పడతారు కనుక అవగాహన లేని ప్రతి పౌరుడికి ఓటర్ లిస్టులో ఓటర్ గా నమోదు చేయవల సిన బాధ్యత మన పై ఎంతైనా ఉందని తెలియజే శారు. అప్పుడే ప్రజాస్వామ్యం లో పౌరులని బలోపేతం చేసి నవారైతం మరియు సరైన నాయకున్ని ఎన్నుకోవడానికి ఎంతో తోడ్పడతారని తెలియజేశారు. సదస్సు నందు దేవేంద్ర , సూపర్వైజర్ ఖాజా మైనుద్దీన్, బి ఎల్ ఓ లు కె.చంద్రశేఖర్, జి. నరేంద్ర, టీ.శ్రీనివాసులు, మెప్మా కమిటీ ఆర్గనైజర్ నంబూరి సురేఖ, సంధ్యా సమైక్య ఆర్పి జింకల సరస్వతి, సరు సమాఖ్య ఆర్ పి మంజువాణి, ఆర్ పి, మరియు బి ఎల్ ఏ ఎం. సుధీర్ ఓటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పెన్నిధి ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు

**ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**

**48 మందికి సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**



**గుంతకల్లు జూలై 10 (ప్రజా జ్యోతి):** శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు గుమ్మనూరు జయరాం మరియు వారి సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి 48 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకున్న వారికి పేదవారి కుటుంబానికి పెద్ద కొడుకుల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తు న్నారని తెలిపారు. అలాగే ఈ రోజున గుంతకల్లు నియోజక వర్గం దాదాపు 48 మందికి గాను 18,66,539 రూపా యలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం జరిగినది. అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం లో ఈ రెండు సంవత్సరాలలో మొత్తం దాదాపుగా 970 మంది గాను 7 కోట్లు రూపాయలు నిరు పేద కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్థిక సహాయం చేయడం జరిగినది. సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం లో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో మన కూటమి ప్రభుత్వం తరఫున ఎవరు పోటీ చేసిన గెలిపించుకొని తీరుతామని అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి బహుమతిగా ఇస్తామని ఈ సభముఖంగా తెలియజేస్తున్నా ము కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.

## ముద్రగడను పరామర్శించిన బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబు

**--హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఏలేశ్వరం వైసీపీ నేతలు**

**-- గిరిబాబుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న గోవింద్ బాబు..**





**కాకినాడ జిల్లా జూలై 10 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని వైసీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబు,ఏలేశ్వరం టౌన్ నాయకులు,అభిమానులు అడిగి తెలుసుకున్నారు.ముద్రగడ పద్మనాభం తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబుతో మాట్లాడి ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు.ముద్రగడ త్వరగా సంపూర్ణ ఆరోగ్యం తో కోలుకోవాలని ఆకాంక్షించారు.శుక్రవారం ఏలేశ్వరం నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరిన నాయకులు సింధు ఆసుపత్రికి చేరుకుని ముద్రగడ పద్మనాభాన్ని పరామర్శించారు.ఆయన త్వరగా కోలుకోని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబుతో పాటు జేవిఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు,నాయకులు దేగల చంద్రమౌళి,సఖిరెడ్డి బుజ్జి, లోగీసు శేఖర్,భీశెట్టి రాజా,సిరిపరపు రాజేష్,రాచర్ల రమేష్,శేషెట్టి శ్రీను, వాడపల్లి శ్రీను,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమైక్యత, జాతీయత, ధర్మ పరిరక్షణ పవన్ కళ్యాణ్ ధ్యేయం



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.జూలై 20.**జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశ సమైక్యత, జాతీయత, ధర్మ పరిరక్షణ ధ్యేయం గా పెట్టుకున్నారని ఆయన ముందు విద్వేష రాజకీయాలు చేసే వారి ఆలోచనలు ఎప్పటికీ నిలవవని జనసేన నాయకురాలు రియా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ రాజకీయాల కోసం రాజకీయాలు చేసే నాయకులు కాదని సమాజం కోసం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం తన గొంతు వినిపించే నాయకులని ఆమె అన్నారు. రాజకీయంగా విభేదాలు ఉంటే సిద్ధాంతాలతో విమర్శించాలని వ్యక్తిగత దూషణలు, అసభ్యకర వ్యాఖ్యలు, మతాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని రియా పేర్కొన్నారు. హిందూ దేవతలను, సనాతన ధర్మాన్ని అవమానించే వ్యాఖ్యలు చేసి సమాజంలో విద్వేషాలు రగిలించే ప్రయత్నం ఎవరైనా చేస్తే ప్రజలు ప్రశ్నించడం సహజమన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించేలా లేదా తీవ్రవాదులను సమర్థిస్తున్నట్టుగా భావించే వ్యాఖ్యలు వస్తే వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. దేశ భద్రత విషయంలో రాజీ ఉండదు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాన్ని గౌరవించే ప్రతి భారతీయుడు ఇలాంటి వ్యాఖ్యలను అంగీకరించరన్నారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే, ప్రజలను విడదీసే ప్రయత్నాలు చేసే వారిపై కూడా చట్టం తన పని చేయాలని అది ప్రజాస్వామ్యానికి, దేశ సమగ్రతకు అవసరమన్నారు.పవన్ కళ్యాణ్ ను వ్యక్తిగతంగా దూషించడం వల్ల ఆయన స్థాయి తగ్గదని ఆయన దేశభక్తి, సేవా దృక్పథం, సమాజం పట్ల ఉన్న బాధ్యత ప్రజలకు తెలుసని ప్రజల కోసం నిలబడే నాయకుడిని విమర్శించే ముందు, మీ మాటలు సమాజాన్ని కలుపుతున్నాయా... లేక విడదీస్తున్నాయా అనే ఆత్మపరిశీలన చేసుకోవాలని రియా అన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు కావలిసింది కుల, మత విద్వేషాలు కాదని అభివృద్ధి, ఐక్యత కావాలని రియా పేర్కొన్నారు.

# డెంగ్యూ మరియు మలేరియా జ్వరాలతో సతమతమవుతున్న మండల ప్రజలు!

**ప్రతీ గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి!..**

**అదనపు వైద్యులను నియమించాలి!.. ఎం.పీ.పీ కారం.లక్ష్మి!..**

**దోమల నివారణ కొరకు చర్యలు చేపట్టి,దోమతెరలు పంపిణీ చేయాలి!..**

**మండలంలోని పి.హెచ్.సి,ని విజిట్ చేసి,జిల్లా వైద్య అధికారిని డి.ఎం.హెచ్.వో,తో మాట్లాడిన!**





**వి.ఆర్.పురం,జూలై 10(ప్రజాజ్యోతి ప్రతినిధి)** వరరామ చంద్రాపురం,మండలంలోని ఉమ్మడివరం, రెడ్డిగుంపు, నాగేంద్రపురం, రామాపురం,తదితర గ్రామాలలో ప్రజలు డెంగ్యూ,మరియు మలేరియా జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వైద్యఅధికారులు గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని మండల ఎం.పీ.పీ కారం లక్ష్మి,కోరారు.శుక్రవారం మండలంలోని,పి.హెచ్.సి,ని పరిశీలించి అక్కడ ఉన్నరోగుల ఆరోగ్యపరమైన విషయాలను, వారికి అందుతున్న,వైద్యుల సేవలు,అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా మండలంలోని ఉమ్మడివరం,రెడ్డి గుంపు గ్రామాలలో ఎక్కువగా డెంగ్యూ మరియు మలేరియా జ్వరాల బారిన పడి ప్రజలు అనారోగ్యాలకు గురైన వారిదగ్గరకు వెళ్లి వారిఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పర్యటనలో ఉన్న జిల్లా వైద్య అధికారులు, డి.ఎం.హెచ్.వో, మరియు అడిషనల్ డి.ఎం.హెచ్.వో లను కలిసి తక్షణమే డెంగ్యూ మరియు మలేరియా నివారణ కొరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని,అవసరమైతే ఇంటి ఇంటికివెళ్లి ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య అధికారులను కోరారు. దానితోపాటుగా ఏజెన్సీలోని దోమ కాటు ఎక్కువగా ఉన్నదని దోమల నివారణ కొరకు దోమల మందు పిచికారి చేయించి,తక్షణమే దోమతెరలు పంపిణీ చేయాలని వారిని కోరారు.ఉమ్మడివరం గ్రామంతో పాటు, రెడ్డిగుంపు, నాగేంద్రపురం, రామాపురం, మొదలైన గ్రామాలన్నింటిలో ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలని మండలంలో ఒకేఒక్క డాక్టర్ ఉండడం వలన పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదని,గ్రామాల్లో క్యాంపులకుఉన్న ఒక డాక్టర్ వెళ్తే,హాస్పిటల్లో డాక్టర్ లేని పరిస్థితి నెలకొందని తక్షణమే మరో డాక్టర్ ను నియమించాలని కోరారు.రానున్నవరదలను దృష్టిలో పెట్టుకొని అదనపు డాక్టర్ నియమించి వైద్యం అందించాలని,సూచించారు. డెంగ్యూ వైద్య నివారణ కొరకు ప్రతిఒక్కరూ కోతులగుట్ట వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రేఖపల్లి పి.హెచ్.సి లో కూడా డెంగ్యూ కి సంబంధించిన మందులు ఉంచి ట్రీట్మెంట్ అందించాలని జిల్లా అధికారులను ఎంపీపీ కారం లక్ష్మి కోరారు.స్పందించిన జిల్లా అధికారులు తక్షణమే మరో డాక్టర్ ను ఏర్పాటు చేసే విధంగా పై అధికారులతో మాట్లాడతామని, డెంగ్యూ కి కూడా రేఖపల్లి హాస్పిటల్లో వైద్యం అందించేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని,గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించి డెంగ్యూ మలేరియా జ్వరాలను నివారణ చేయడం కోసం ప్రయత్నం చేస్తామని ఎంపీపీ కారం లక్ష్మి,కి హామీ ఇవ్వడం జరిగింది. ఈ పర్యటనలో ఎం.పీ.పీ కారం లక్ష్మితో పాటుగా సి.పి.ఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం. శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు. సత్యనారాయణ, కుంజ కన్నయ్య, నాల్లారపు.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలి

**గడువు ముగియడానికి నాలుగు రోజులే**

**అప్రమత్తంగా ఉండండి తహసీల్దార్ వెంకటేశ్వర్లు**



**రామాపురం జూలై 10 ప్రజా జ్యోతి** రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి రామాపురం మండల ప్రజలు పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమానికి గడువు ముగియడానికి మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జూలై 11వ తేదీలోపు ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు అందజేయాలని అధికారులకు సూచించారు.అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇంటి వద్దకు వచ్చే బీఎల్ఓలు, ఇతర అధికారులకు అవసరమైన పత్రాలను అందజేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో నివసిస్తున్న వారితో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు కూడా సమాచారం అందించి గడువులోపు ఫారాలు సమర్పించేలా చూడాలని సూచించారు.ఈ నెల 14వ తేదీ ఎస్ఐఆర్ కార్యక్రమానికి చివరి తేదీ కావడంతో ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకుని, అవసరమైన ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు కాబట్టి ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎస్ఐఆర్ ఫారాలను సమర్పించని వారి పేర్లు డ్రాఫ్ లిస్టులో కూడా ఉండదని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు గడువులోపు ప్రక్రియను పూర్తి చేసి అధికారులకు సహకరించాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

# బియ్యం కోసం లబ్ధిదారులు పడిగాపులు

**గిరిజనులకు తీవ్ర కష్టాలు.**



**అనంతగిరి మండలం.జులై10. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. కివర్ల గ్రామంలో గల ప్రభుత్వ చౌకధర దుకాణం డిపోలో ప్రభుత్వం పంపిణి చేస్తున్న ఉచిత బియ్యం కోసం లబ్ధిదారులు ఉదయం నుండి పడిగాపులుగాస్తున్నామనితీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ట్యాంగిలబంద రేషన్ లబ్ధిదారులు పాడి బుద్రన్న మాట్లాడుతూ చౌక ధర దుకాణంలో సుమారు 6. గ్రాముల నుండి నిత్యవసర సరుకులు కోసం డిపోలో ఉన్న 253. కార్డుల లబ్ధిదారులు బియ్యం విడిపించడం కోసం ఒక రోజు పని కేటాయించుకుని సుమారుగా పది కిలోమీటర్ల దూరం గంటల తరబడి నడవవలసిన దుస్థితి ఏర్పడిందని. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆయంలో ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు ఇంటింటా బియ్యం పథకం అందించే వారిని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి గిరిజనుల కష్టాలు కూటమి నాయకులకు అధికారులకు తెలియడం లేదని రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల నుండి డిపో కి రావాలంటే గంటల తరబడి నడిచి వచ్చినప్పుడు అందుబాటులో సేల్స్ మెన్ లేకపోతే నిరాశతో తిరుగు ప్రయాణం చేయవలసి వస్తుందని.ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇటువంటి తరుణంలో సంబంధిత అధికారులు. కూటమి నాయకులు ఇంటింటా బియ్యం పంపిణీ పథకం అందుబాటులో తేవాలని ఆయన కోరారు

# ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా యూరియా, డీఏపీ విక్రయాలు

**వ్యవసాయ శాఖ మండల అధికారి సుధాకర్.**

**నంద్యాల (శిరివెళ్ల) ప్రజాజ్యోతి:జులై=10** ఏపీ ప్రభుత్వం ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌కు చెక్ పెట్టేందుకు వ్యవసాయ శాఖ సరికొత్త విధానాన్ని ప్రకటించిందని ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే ఫర్టిలైజర్ దుకాణం యజమానులు క్రయవిక్రయాలు జరుపుకోవాలని. మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలియజేశారు.స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫర్టిలైజర్ దుకాణాలతో సమావేశం నిర్వహించి యూరియా డి ఏ పి ఇతర కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలపై ప్రభుత్వ నిబంధనలను వివరించారు. ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారానే పంటల విస్తీర్ణాన్ని బట్టి విడతల వారీగా యూరియా, డీఏపీ విక్రయాలు జరపాలని ఎరువులు పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు.సాగుదారులకు సకాలంలో.... సరైన ధరకే యూరియా, డీఏపీ ఎరువులను అందించే లక్ష్యంతో ప్రత్యే కంగా రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్' (ఏపిఏఐఎంయస్ 2.0 - ఏపీఎయిమ్స్) యాప్‌ను ప్రభుత్వం అధికారికంగా అందుబాటులోకి తెచ్చిందని ఏవో సుధాకర్ వివరించారు. ఈ సరికొత్త యాప్ ఆధారిత విధానం ద్వారా క్రయవిక్రయాలు ఆన్లైన్లో స్పష్టం అవుతాయని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకున్న ఆన్లైన్ లోనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎఓ తెలియజేశారు.




# ధర్మవరంలో ఎమ్మెల్యే సత్యప్రభ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**--రైతు సేవా కేంద్రం,వెల్నెస్ సెంటర్ ప్రారంభం.**

**--రూ.21 లక్షల డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

**కాకినాడ జిల్లా జూలై 10 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబీతో కలిసి రైతు సేవా కేంద్రం,వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు.అనంతరం గ్రామంలో సుమారు రూ.21 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ పనులతో గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడి ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తర్వాత నిర్వహించిన మండల స్థాయి ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి,సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ప్రజా దర్బార్‌లో తహసీల్దార్ ఎం సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవిఆర్ కుమార్ బాబు, ఏవో జోకా అమృత వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ వనపర్తి బద్రి, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమలచైర్మన్ కొమ్ముల కన్నబాబు,స్థానిక నాయకులు బొల్లు కొండబాబు,బొల్లు వెంకటేశ్వరరావు (చిన్నా), ఇంధన ఏసుబాబు,బొండాడ నారాయుడు,ముప్పనబోయిన ఏసుబాబు, బొల్లు మనోజ్,మంతెన వెంకటరమణ,యర్రాబత్తుల గోవింద్ నాయుడు,వెలుగుల నాని,దాకారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి, ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం?

**ప్రజలను మోసం చేసిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే**

**ఎమ్మెల్యే బీవీ పై ఘాటైన విమర్శలు కే.మురహరి రెడ్డి**

**ఎమ్మిగనూరు జులై 10(ప్రజా జ్యోతి ):** స్థానిక పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కేఆర్ మురహరి రెడ్డి ఆధ్వర్యంలో స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగ నూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పనితీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. 2002 ఎన్నికల ప్రక్రియ ప్రకారం లో ఎమ్మెల్యే బీవీకి ఓటు హక్కు ఏ విధంగా వచ్చింది. 2004 ఎలక్షన్లో వాళ్ళ నాన్నగారు మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి ఎలక్షన్ అఫిడివెట్లో నేను బ్రహ్మచారి అని పేర్కొన్నారి ? ఇప్పుడు ఎమ్మెల్యేకి ఫోటోకు ఏ విధంగా వచ్చింది? ఎమ్మిగనూరులో సూపర్ సిక్స్ పథకాలు విఫలం,చేనేతలకు చేసింది ఏమీ లేదు, టెక్స్టైల్ పార్కు, ఆర్డీఎస్ రైట్ కెనాల్, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, వంటగ్యాసు ఈ హామీలను అమలు చేయడంలో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే, ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అభివృద్ధి పేరు తో కేవలం పైపై మెరుగులు అద్ది ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు జరగడం లేదని విమర్శించారు.తనను నమ్ముకున్న సొంత పార్టీ కార్యకర్తలను కూడా ఎమ్మెల్యే దూరం పెట్టారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని మురహరి రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నా వాటి పరిష్కారంపై ఎమ్మెల్యే చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. అలాగే టిట్కో గృహాలు ఇప్పటికి వారి చేతికి అందింది లేదు అక్కడ వసతులు ఏమీ లేవు, గృహాలు ప్రారంభించి అక్కడ మౌలిక వసతులు మరిచిపోయిన కూటమి ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని, తమ నాయకుడిని "గొడ్డలి పార్టీ" అని విమర్శించడం సరికాదని పేర్కొంటూ, గొడ్డలి పార్టీ మా పార్టీ కాదు. వెన్నుపోటు పార్టీ మీదే. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట చెప్పి ప్రజలను మోసం చేసింది మీరే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు కాకుండా కేవలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ప్రజల సమస్యలు వినే నాధుడే లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని, అభివృద్ధి పనులపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని మురహరి రెడ్డి డిమాండ్ చేశారు.



# గురుకుల పాఠశాలల ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం

**కంబదూరు,తిమ్మాపురంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి.**

**గిరిజన సంక్షేమ సంఘం రాయల సీమ జిల్లా అధ్యక్షు సూర్య నాయక్**

**కంబదూరు జూలై 10:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాలను గురుకుల (రెసిడెన్షియల్) పాఠశాలలుగా మార్చనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లా అధ్యక్షులు సూర్య నాయక్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలను సద్వినియోగం చేసే ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు.అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కంబదూరు మండలం కర్ణాటక సరిహద్దులో ఉన్న అత్యంత వెనుకబడిన, కరువు ప్రభావిత ప్రాంతమని తెలిపారు. ఈ మండలంలోని తిమ్మాపురం, కంబదూరులో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో వినియోగంలో లేకపోవడం బాధాకరమన్నారు.అందువల్ల ఆ భవనాలను నిరుపయోగంగా వదిలేయకుండా, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల గ్రామీణ, పేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు ప్రాంతీయ విద్యాభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని అన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కంబదూరు, తిమ్మాపురం ప్రాంతాలను గురుకుల విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని గిరిజన సంక్షేమ సంఘం తరఫున విజ్ఞప్తి చేశారు. ప్రజాధ నంతో నిర్మించిన భవనాలు ప్రజలకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, ఈ నిర్ణయం ఇతర వెనుకబడిన ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు




## వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురికి రిమాండ్



**తాళ్లపూడి, జూలై 9 ,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై టి రామకృష్ణ తెలిపారు. కావూరి పోసియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితులను అదుపులోకి తీసుకుని కొవ్వూరు కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వ్యక్తులకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై టి రామకృష్ణ తెలిపారు

## శంఖవరం మండలంలో ఎస్ఐఆర్ ను ఝురూ చేయండి

**ప్రత్తిపాడు నియోజకవర్గం ఎన్నికల అధికారి శ్రీనివాసరావు**



**శంఖవరం:జులై 8 (ప్రజాజ్యోతి న్యూస్)** శంఖవరం మండలంలోని గ్రామాల్లో జనగణన సర్వే (ఎస్ఐఆర్) ను ఝురూ చేయాలని సూపర్వైజర్లను, బిఎల్ఏలను ప్రత్తిపాడు నియోజకవర్గం ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని నెల్లిపూడి, శంఖవరం గ్రామాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ను పరిశీలించి, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేసారు. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ సూపర్వైజర్, బిఎల్ఏ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజల వివరాలు సేకరించి, నమోదు చేయాలని, పూర్తి చేసిన ఫారంను త్వరితగతిన ఆన్ లైన్ చేయాలన్నారు. వలసలు వెళ్ళిన వారు, మరణించిన వారి వివరాలను జాగ్రత్తగా పరిశీలన చేయాలని సూచించారు. అన్నవరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై తహశీల్దార్ సూరిబాబు, ఎంపిడిఓ నాగేంద్ర ప్రత్యేక దృష్టి సారించి, సిబ్బందిని అప్రమత్తం చేసారు. జనగణన సర్వేలో పాల్గొనే సిబ్బంది చురుకుగా వ్యవహరించి, ఎన్నికల కమీషన్ ఇచ్చిన గడువులోగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ కిరణ్ కుమార్, మండల ఎన్నికల అధికారి సూర్య, పంచాయితీ కార్యదర్శి అప్పలరాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో బొమ్మ బోకు జూదంపై పోలీసుల దాడి - 7 మంది అరెస్ట్, రూ. 23,500 స్వాధీనం,

**జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం" ఎస్సై లక్ష్మీకాంతం**



**శంఖవరం జులై 8 (ప్రజాజ్యోతి న్యూస్)** ప్రత్తిపాడు మండలంలో బొమ్మ బోకు జూదం ఆడుతున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ. 23,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ సూచనలతో, ప్రత్తిపాడు సీఐ బి. సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి పెదశంకర్లపూడి గ్రామ శివారులో దాడి చేశారు. ఎస్సై లక్ష్మీకాంతంకు అందిన ముందస్తు సమాచారంతో జూదం ఆడుతున్న ప్రాంతంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ, "ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట, బొమ్మ బోకు, గుండాట, కోడిపందాలు వంటి జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుంది" అని హెచ్చరించారు

## అదితి విజయలక్ష్మి ని మర్యాదపూర్వకంగా కలిసిన సిరిపురం.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** ఈ రోజు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు గారి స్వగృహం లో మర్యాద పూర్వకంగా కలిసి, దుస్సాలువాతో సత్కరించిన శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల నిఘా అత్యంత కీలకం

### కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ :** కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో 21 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం. యువత డ్రగ్స్, సైబర్ గేమింగ్ అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సాధించాలి. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే 'రహవీర్' పథకం ద్వారా రూ.25 వేల బహుమతితిమ్మాపూర్ సర్కిల్ గన్నేరువరం:శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను, పరువెల్ల గ్రామంలోని 8 సీసీ కెమెరాలను, గునుకుల కొండాపూర్ గ్రామంలో 4 కెమెరాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు.అనంతరం గన్నేరువరం పోలీసుల ఆధ్వర్యంలో ఖాసీంపేటలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ సీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఖాసీంపేటలో విద్యార్థులు, ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్,గన్నేరువరం ఎస్సై ఆవుల నరేందర్ రెడ్డిలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 వాటర్ వార్....

హైదరాబాద్, జూలై 10, (న్యూస్ పల్స్)

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గోదావరి ఉరకలెత్తుతోంది. అయితే, ఈసారి నదిలో ప్రవహిస్తున్న వరద నీటి కంటే, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ సాగుతున్న రాజకీయ వేడే ఎక్కువగా కనిపిస్తోంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న తరుణంలో మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంటే.. ఇప్పుడు గనుక పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్టు బ్యారేజీలే కుప్పకూలుతాయని అధికార కాంగ్రెస్ హెచ్చరిస్తోంది. ఈ ప్రచార యుద్ధం వెనుక అసలు నిజాలేంటి? సాంకేతిక నివేదికలు ఏం చెబుతున్నాయి?బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల ప్రధాన వాదన ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్ హౌస్‌లు, బాహుబలి మోటార్లు అన్నీ సురక్షితంగా ఉన్నాయి. కేవలం కొన్ని బ్యారేజీల పిల్లర్లు మాత్రమే దెబ్బతిన్నాయి. వరద నీరు వృధాగా సముద్రం పాలు కాకుండా, పంపింగ్ సిస్టమ్‌ను తక్షణమే ఉపయోగించి మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి ప్రధాన రిజర్వాయర్లను నింపాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే భయంతో, కావాలనే పొలిటికల్ మైలేజ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఒక వ్యర్థ కట్టడంగా చిత్రించేందుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నాయి.బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక ఆధారాలతో తిప్పికొడుతోంది. పంప్ హౌస్‌లు బాగున్నాయన్నది నిజమే కావొచ్చు, కానీ వాటికి నీటిని అందించాల్సిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునాదులు కదిలిపోయాయన్నది నగ్న సత్యమని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. దీనికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్, మధ్యంతర నివేదికలను చూపిస్తోంది.గత ఏడాది మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం బ్యారేజీలో ఊటలు రావడం వంటి తీవ్రమైన ఘటనల తర్వాత ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. పూర్తిస్థాయిలో మరమ్మతులు జరగకుండా, పునాదుల కింద గ్రౌటింగ్ పూర్తికాకుండా బ్యారేజీలలో నీటిని నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరమని ఆ కమిటీ స్పష్టం చేసింది. ఒకవేళ బలవంతంగా నీటిని నిల్వ ఉంచితే ఏర్పడే 'హైడ్రోస్టాటిక్ ప్రెజర్' కారణంగా మిగిలిన పిల్లర్లు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బ్యారేజీలో నీరు నిలిస్తేనే పంపుల ద్వారా ఎత్తిపోయడం సాధ్యమవుతుంది. కాబట్టి, పునాదులే కదిలిన చోట నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని చూడడం ఆత్మహత్యాసదృశ్యమేనని అధికార పక్షం వాదిస్తోంది.ఈ ప్రచార యుద్ధానికి తెరదించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షానికి ఒక బహిరంగ సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపాలు, అడ్డగోలు ఖర్చులు, ప్రస్తుత దుస్థితిపై అసెంబ్లీ వేదికగా సుదీర్ఘమైన లైవ్ చర్చకు రావాలని సవాల్ చేశారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ వివరాలు, సాంకేతిక తప్పిదాలను ప్రజల ముందు ఉంచి.. రీ-డిజైనింగ్ పేరిట జరిగిన వేల కోట్ల రూపాయల వ్యయం వెనుక ఉన్న అసలు నిజాలను నిరూపించాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది.ఈ సవాల్‌పై హరీష్ రావు సానుకూలంగానే స్పందించినప్పటికీ, గతంలో కాళేశ్వరంపై జరిగిన లఘు చర్చలకు గులాబీ బాస్ కేసీఆర్ హాజరుకాలేదు. ఒకవేళ ఈసారి అసెంబ్లీలో గనుక పూర్తిస్థాయి పోరు జరిగితే, అది ఉభయ పార్టీలకు ప్రతిష్టాత్మకమైన 'చావో రేవో' లాంటి పరిస్థితిగా మారుతుంది. తాము నిర్మించిన ప్రాజెక్టును కాంగ్రెస్ చేతకానితనంతోనే వదిలేసిందని నిరూపించాలని బీఆర్ఎస్.. లేదు ఇది కేవలం 'కమిషన్ల స్కామ్' మాత్రమేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తున్నాయి.సోషల్ మీడియా వేదికగా సాగే ట్వీట్లు, కౌంటర్ ట్వీట్ల పొలిటికల్ డ్రామా వల్ల తెలంగాణ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అసెంబ్లీ సాక్షిగా, నిపుణుల సమక్షంలో పారదర్శకమైన చర్చ జరిగి, ఎన్డీఎస్ఏ నివేదికలోని సాంకేతిక అంశాలు ప్రజల ముందుకు వచ్చినప్పుడే.. వేల కోట్లతో నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుపై ఒక స్పష్టత వస్తుంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**హుజురాబాద్ : జూలై 10** హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్స చేసి కణితి తొలగించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణిగుంట్ల కొమరమ్మ అనే మహిళ గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. చికిత్స కోసం గత రెండు రోజుల క్రితం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు.

## రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం.

### ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టినటువంటి రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలని,విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను అందించాలని, మధ్యాహ్నం భోజన పథకానికి నిధులు పెంచి అక్షయపాత్ర, ఇస్కాన్, మన్న సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ లెక్చరర్ మరియు ఎంఈఓ ,డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని ,పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ ని విడుదల చేసి జిఓ నెంబర్ 7, 8 ,9 లను రద్దు చేయాలని, ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్నం భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి నిధులు కేటాయించాలని ,అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్స్ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్స్ ను ఏర్పాటు చేసి ఆధునాతన భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బడి బస్సులు నడపాలని ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ప్రతి పాఠశాలకు కరెంటు ,ఇంటర్నెట్ త్రాగునీరు ,వంట షెడ్లు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని, విద్యాసంస్థలలో ర్యాగింగ్ నిరోధక, డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, విద్యాహక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ,కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులు, ఉచిత లాప్టాప్ లు అందించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరల పార్టీ పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాల పై చర్యలు తీసుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చినటువంటి పిలుపుకు సహకరించిన ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు ఆయన తెలియజేశారు.

# కేవీకే ఊటుకూరులో ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం






**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి జూలై 10:** కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), ఊటుకూరులో ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ ఉపకులపతి డా. పి.వి. సత్యనారాయణ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచడంలో విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రత్యక్ష మార్కెటింగ్, రైతు--వినియోగదారుల అనుసంధానం కీలకమని తెలిపారు. కేవీకేలు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడంతో పాటు రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని సూచించారు.ఈ విక్రయ కేంద్రం ద్వారా చిరుధాన్య ఉత్పత్తులు, పప్పుధాన్యాలు, తేనె, పుట్ట గొడుగులు తదితర విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను రైతులు, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు యువ పారిశ్రామిక వేత్తలు నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. దీంతో రైతులు తమ సొంత బ్రాండ్‌ను అభివృద్ధి చేసుకోవడంతో పాటు మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విస్తరణ సంచాలకులు డా. జి. రామచంద్రరావు మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం విశ్వవిద్యాలయం విస్తరణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఊటుకూరు కేవీకేలో నిర్వహిస్తున్న విలువ ఆధారిత ఉత్పత్తుల శిక్షణలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, ఈ విక్రయ కేంద్రం రైతులు, మహిళా సంఘాలు, ఎఫ్‌పీఓలకు శాశ్వత మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ పరిశోధనా సంచాలకులు డా. వి. చంద్రిక మాట్లాడుతూ పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు చేరి, రైతులు తయారు చేసిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరినప్పుడే వ్యవసాయ అభివృద్ధి సార్థకమవుతుందని పేర్కొన్నారు.కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. వి. శిల్పకళ మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణలు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం వంటి సేవలు అందిస్తున్న కేవీకేకు ఈ విక్రయ కేంద్రం మరో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డా. జి. ప్రభాకర రెడ్డి, డా. ఎన్. కృష్ణప్రియ, డా. కె. సునీల్ కుమార్, డా. ఎ. సుబ్రమణ్యం, డా. పి. శ్రీవల్లి, డా. సి. యాస్మిన్, డా. టి. మహేష్ బాబు, డా. కె. సాయి మహేశ్వరి, డా. ఎస్. మానస, డా. ఐ. సురేష్ కుమార్ రెడ్డి, శాస్త్రవేత్తలు, కార్యాలయ సిబ్బంది, దాదాపు 100 మంది రైతులు, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఎవరికి సరిపోని విత్తనాలు పంపించి పంపిణీ చేయమంటే ఏలా?





**విత్తనాల పంపిణీని నిలిపివేసిన రైతాంగం!..**

**వి.ఆర్.పురం,జులై10(ప్రజాజ్యోతి ప్రతినిది)** వరరామ చంద్రాపురం, మండలం ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులకు విత్తనాలు1500 బ్యాగులు ఇవ్వాల్సి ఉండగా? ప్రభుత్వం నుంచి కేవలం 1000 బ్యాగులు మాత్రమే పంపించి రైతులకు పంపిణీచేసే క్రమంలో ఎవరికి సరిపోవని, విత్తనాలను పంపించి పంపిణీ చేయమంటే ఏలా? సాధ్యమౌతుందని రైతులందరూ మండల ఎం.పీ.పీ కారం లక్ష్మి, సారథ్యంలో ఆందోళన చేసి ఆపంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు.ఈ సందర్భంగా,ఎం.పీ.పీ కారం లక్ష్మి, మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయసాగుకు రైతులు వరినార్లు పోయడంలో వెనకబడ్డారని,దీనికి కారణం ప్రభుత్వంనుంచి రావాల్సిన విత్తనాలు ఆలస్యంమైయ్యాయని, ఇప్పటికైనా అందరికీ సరిపడా విత్తనాలు పంపిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తుంటే, సాలీచాలని విత్తనాలు పంపడంలో రైతులపట్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇంకా పంపాల్సిన 500 బ్యాగులు తెప్పించి రైతులను ఆదుకోవాలని లేదంటే రైతులందరినీ తీసుకొనివెళ్లి ఐ.టీ.డీ. ఏ,కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులు, మహిళా రైతులు,స్థానిక సర్పంచ్ సవలం.మారయ్య, సి.పి.ఎం,పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు,పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురం -బెంగుళూరు రెగ్యులర్ ఎక్స్ ప్రెస్ ప్రారంభం

**పాలకొల్లులో ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ.**





**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూలై 10.** నర్సాపురం నుండి బెంగళూరుకు ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలుగా నడిచిన సర్వీసును రెగ్యులర్ వీక్లీ ఎక్స్ ప్రెస్ గా మార్చారు. ఈ తొలి సర్వీసును శుక్రవారం పాలకొల్లు రైల్వేస్టేషన్ రెండవ ప్లాట్ పారం వద్ద కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ రైల్వే స్టేషన్ ఆవరణలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రత్యేక రైలుగా నడిచిన నర్సాపురం బెంగుళూరు సర్వీస్ కు ప్రజల నుండి విశేష ఆదరణ లభించడంతో ఈ సర్వీస్ ను ప్రజల అభ్యర్థన మేరకు రైల్వే అధికారులతో చర్చించి నర్సాపురం బెంగుళూరు వీక్లీ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ గా మార్చుటానికి చేసిన కృషి ఈ రోజుకు విజయవంతమైందన్నారు. ఈ రైలు ప్రతి శుక్రవారం నరసాపురం నుండి మధ్యా హ్నం 3:50 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 9:45 గంటలకు బెంగళూరు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం ఉదయం 11 గంటలకు బెంగళూరు నుండి బయలుదేరి ఆదివారం తెల్లవారు జామున 5:50 గంటలకు నరసాపురం చేరుకుంటుందని వివరించారు. వారాంతపు రోజులలో బెంగుళూరు నుండి రాక పోకలు సాగించి వ్యాపారవేత్తలు ఐటి ఉద్యోగులు విద్యార్థులు ఇతర ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శ్రీనివాస వర్మ అన్నారు నర్సాపురం నుండి బయలుదేరే ఈ రైలు పాలకొల్లు భీమవరం ఆకివీడు కైకలూరు గుడివాడ విజయవాడ తెనాలి బాపట్ల చీరాల ఒంగోలు కావలి నెల్లూరు గూడూరు రేణిగుంట తదితర రైల్వే స్టేషన్లో ఆగుతుందని దీని వలన పశ్చిమగోదావరి జిల్లాతో పాటు ఆ మార్గంలోని ఇతర ప్రాంతాలకు మెరుగైన రైల్వే సౌకర్యం కలుగుతుందన్నారు. ప్రత్యేక సర్వీస్ నుండి వీక్లీ రెగ్యులర్ సర్వీస్ గా మారడంతో టిక్కెట్ ధరలు దాదాపు 30 శాతం వరకు తగ్గుతాయని సమయపాలన నిర్వహణ మరింత మెరుగుగా ఉంటుందని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ తెలిపారు. నరసాపురం ప్రాంతానికి కొత్త రైలు సర్వీస్‌లను తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. విజయవాడ బెంగళూరు మధ్య త్వరలో ప్రారంభం కానున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ ను నర్సాపురం నుంచి ప్రారంభించాలని రైల్వే శాఖ దృష్టికి తీసుకు వెళ్ళమన్నారు. అదేవిధంగా పాలకొల్లు భీమవరం ఆకివీడు రైల్వేస్టేషన్లలో రూ 20 కోట్ల వ్యయం తో నిర్మిస్తున్న రైల్వే షెడ్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పాలకొల్లు రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్ ఏర్పాటు చెయ్యనున్నట్లు శ్రీనివాసవర్మ తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ డిఆర్ యూసీ సభ్యులు జక్కంపూడి కుమార్ బిజెపి పట్టణ అధ్యక్షులు కొల్లు కొండ ప్రసాద్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చినబాబు తులా రామలింగేశ్వర రావు టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు జి వెంకటేశ్వర రావు టిడిపి బిజెపి జనసేన నాయకులు రైల్వే శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఎం వి సత్యనారాయణ



**కాకినాడ జిల్లా జూలై 10 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహామూర్తి (బుజ్జి)ని వెలుగు విభాగంలో ఏలేశ్వరం మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.పెద్దనాపల్లి గ్రామంలోని ఎంపీపీ బుజ్జి నివాసం వద్ద వెలుగు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జికి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎం సత్యనారాయణకు ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే విధంగా విధులను పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించాలని ఏపీఎం సత్యనారాయణకు ఎంపీపీ బుజ్జి సూచించారు.

# బద్వేలు లో సర్ ప్రక్రియ 78 .68% పూర్తి



ఆర్డీవో చంద్రమోహన్

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 10 (ప్రజా జ్యోతి)**బద్వేలు నియోజకవర్గంలో సర్ ప్రక్రియ 78. 68 శాతం పూర్తి అయినట్లు ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని కలసపాడు, కాశీనాయన పోరుమామిళ్ల ,బి కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో మొత్తం ఓటర్లు 2,22,043 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 1,74,704 మంది ఓటర్లు నమోదు అయ్యారన్నారు. ఇంకా 41,058 మంది ఓటర్లు నమోదు కావాల్సి ఉందని చెప్పారు .నియోజకవర్గ వ్యాప్తంగా సర్ప్రక్రియలో బిఎల్ఓ లతో సహా 1500 మంది ఉద్యోగులు పాల్గొన్నట్లు చెప్పారు. గుర్తించిన 6,281 మందిలో చనిపోయిన వారు, డబల్ ఎంట్రీలు, షిఫ్టింగ్ అయినవారు ఉన్నట్లు తెలిపారు.

**రాజకీయ పార్టీలు సహకరించడం లేదు**

రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ఒక్క ఓటు కూడా ఎంతో కీలకమని ఆర్డిఓ చంద్రమోహన్ అన్నారు .ఏ ఒక్క రాజకీయ పార్టీ సర్ ప్రక్రియలో సహకారం అందించడం లేదన్నారు .ఇప్పటికైనా వారు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు . ప్రతి ఒక్కరూ ఓటు మిస్ కాకుండా నమోదు ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు సూచించారు. లేకుంటే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.బద్వేలు ఆర్టీవో కార్యాలయంలో సర్ ప్రక్రియకు సంబంధించి ఒక కంట్రోల్ రూమ్ పెట్టామన్నారు. సందేహాలు ఉన్నవారు చరవాణి 6301432849 నెంబర్ కు చేస్తే నివృత్తి చేస్తారన్నారు కార్యక్రమంలో బద్వేలు గోపవరం తహసిల్దార్లు తిరుమల బాబు, జీవన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రైతుభరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి చిత్రపటాలకు పాలాభిషేకం



**జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ కలిసి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రైతు భరోసా నిధులను విడుదల చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు పక్షపాత వైఖరికి నిదర్శనమని అన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం మాటలు కాదు చేతలు చూపిస్తోందన్నారు. రైతు భరోసా నిధుల విడుదలతో రైతులకు సాగు పనుల్లో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ ప్రెసిడెంట్ ఇస్లావ దేవాన్, గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, దండు రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భువన సుందర్, పథకాన్ని సమ్మయ్య, వెంకీ యాదవ్, ఒరము సమ్మన్న, మున్సిపల్ చైర్మన్ బుర్ర, వైస్ చైర్మన్ అంబాల శీను, పృధ్వి, కురుమల శీను, టౌన్ ప్రెసిడెంట్ కడారి మాలతి, లక్ష్మి, నసుయ్ ఎన్ ఎస్ యూ ఐ జిల్లా ప్రెసిడెంట్ మట్టేవాడ సురేష్, అప్పన్ కిషన్, రామ్ చరణ్, ముంజల రవి, పరమేశ్వరి, కిషోర్, అఖిల్, రాజు, ప్రజాప్రతినిధులు, రైతులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కవిత టార్గెట్ కేటీఆర్...



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం రేగింది. బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం, దాని అనుబంధ సోషల్ మీడియా వైఖరిపై టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గులాబీ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల భారీ నిధుల వెనుక క్విడ్ ప్రో కో అవినీతి దాగి ఉందంటూ ఆమె చేసిన ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సొమ్మును తక్షణమే తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ వ్యక్తిగత విమర్శలకు పోలేదని స్పష్టం చేస్తూనే, బీఆర్ఎస్ విధానాలపై విమర్శల పర్వాన్ని ఎక్కుపెట్టారు.తాను మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరుకుంటానంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని కవిత పూర్తిగా ఖండించారు. "నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. ఒక మహిళ ఒంటరిగా ప్రజాబలంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేక, కాంగ్రెస్, బీజేపీలతో చేతులు కలిపి తన ప్రజా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చివరికి టీఆర్ఎస్ అనే పేరు కూడా తనకు దక్కకుండా చేసేందుకు ఏకంగా ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు పంపడం బీఆర్ఎస్ భయాందోళనలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ అగ్రనేతలను టార్గెట్ చేస్తూ కవిత ఘాటు విమర్శలు చేశారు. కాళేశ్వరం అవినీతిలో అనకొండ లాంటి హరీశ్‌రావును బీఆర్ఎస్ ఇంకా ముందు పెట్టడం చూస్తుంటే, ఆ పార్టీ భవిష్యత్తు శూన్యమని అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. అలాగే కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో పద్ధతిలో అక్రమ పర్మిషన్లు ఇచ్చారని, ఇటీవల రూ. 188 కోట్లు వెచ్చించి 'పయనీర్' అనే ఇంగ్లీష్ పేపర్‌ను కొనుగోలు చేశారని ఆరోపించారు. డబ్బు బలంతో మీడియా, సోషల్ మీడియాలను గుప్పిట్లో పెట్టుకుని, తమ వార్తలు బయటకు రాకుండా గుంటనక్కల్లా ఫోన్లు చేయిస్తూ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోడెద్దుల్లా పార్టీని నడపాల్సిన వారే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు.సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ శ్రేణులు తల్లి, చెల్లె అనే కనీస సభ్యత మరచి ఇష్టానుసారంగా ట్రోలింగ్ చేస్తున్నారంటూ కవిత తీవ్రంగా ఫైర్ అయ్యారు. "సభ్యత మరిచి తిడితే ఊరుకునేందుకు ఇది ఆంధ్రా కాదు, కాళ్లు విరగొట్టి చేతుల్లో పెడతాం బిడ్డా" అంటూ ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు ఫినిక్స్ సంస్థకు రూ. 80 వేల కోట్ల విలువైన భూములను కట్టబెట్టారని, అటవీ శాఖ పెట్టిన కేసులను కూడా పక్కనబెట్టేశారని ఆరోపించారు. అవినీతి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కిటికీలు తెరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులు తెరిచిందని విమర్శించారు. కేవలం సీఎంపై కోపంతోనే కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడం లేదని, చిన్న రాళ్ల కట్ట కడితే నీటిని వాడుకోవచ్చని సూచించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న కాంట్రాక్టర్లు, స్కూల్ యాజమాన్యాలు ఎంతో త్యాగం చేశాయని, తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కూడా కార్మికులు, ఉద్యమకారుల పక్షాన నిలబడి కొట్లాడానని కవిత గుర్తు చేసుకున్నారు. కానీ వారికి అక్కడ అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పనంగా అప్పగించిన భూములన్నింటిపై ఖచ్చితంగా రివ్యూ జరిపి, అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక దీక్షకు దిగుతున్నట్లు ప్రకటించి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజా అజెండా లేదని తేల్చి చెప్పారు.

## ఉచిత పథకాలకు కోర్టు బ్రేక్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయి. నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాల చట్టబద్ధతపై తెలంగాణ హైకోర్టు తీవ్ర సందేహాలను, అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అసెంబ్లీ ఆమోదం లేకుండా, కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా వందల, వేల కోట్ల ప్రజాధనాన్ని ఏ విధంగా పంపిణీ చేస్తారని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ నిలదీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు.న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆధారంగా ఈ విచారణ సాగింది. చట్టసభ ఆమోదం లేకుండా కేవలం 8 జీవోల ఆధారంగా ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు మళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ కోర్టుకు నివేదించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246ల ఉల్లంఘన కిందికే వస్తుందని వాదించారు. చట్టపరమైన నిబంధనలు, శాసనసభ పర్యవేక్షణ లేకుండా ఇంత పెద్ద ఎత్తున నిధులను కేటాయించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, ఈ పథకాలకు సంబంధించిన జీవోలను రద్దు చేయాలని కోరారు.ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ప్రాధాన్యతలపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకవైపు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని, నిధుల సమీకరణ కోసం ప్రభుత్వ భూములను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కోర్టు గుర్తు చేసింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందడం లేదని, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణకు సంబంధించిన పరిహారాలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని న్యాయస్థానం ఎత్తిచూపింది.రాష్ట్రం అప్పుల్లో ఉండి, కనీస చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు, మిగులు బడ్జెట్ ఉంటే సంక్షేమ పథకాలు లేదా ఉచితాలు ఇవ్వడంలో తప్పు లేదని, కానీ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని కోర్టు హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 13,484 కోట్లు ఖర్చు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇంత భారీ మొత్తాన్ని వెచ్చిస్తున్నప్పటికీ, పర్యవేక్షణ లోపం వల్ల అనర్హుల చేతుల్లోకి నిధులు వెళు తున్నాయని ఆరోపించారు. కాగ్ నివేదికల ప్రకారం.. సుమారు రూ. 90 కోట్లు అనర్హుల పాలయ్యాయని కోర్టుకు సమర్పించిన నివేదికల్లో పేర్కొన్నారు.అయితే, ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ ఈ వాదనలను తోసిపుచ్చారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతతోనే ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉందని, పేదల సంక్షేమాన్ని విస్మరించలేమని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే, దీనిపై సమగ్ర వివరణ ఇవ్వడానికి ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది.ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు ఉచిత పథకాలను ఎరగా వేస్తున్నాయనే విమర్శలు వ్యూహాత్మకంగా వినిపిస్తున్న తరుణంలో, హైకోర్టు ఈ అంశాన్ని చట్టబద్ధత కోణంలో ప్రశ్నించడం అత్యంత ప్రాధాన్యతను సంతరింపజేసుకుంది. మరి ప్రభుత్వం చట్టసభ ఆమోదం అంశంపై న్యాయస్థానానికి ఎలాంటి వివరణ ఇస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ప్రభుత్వ కళాశాలలో వనమహోత్సవం.

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి. రమేష్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ కళాశాల ప్రిన్సిపల్ నరసయ్య ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు ప్రముఖ పాత్ర వహిస్తాయి విద్యార్థులు ప్రతి ఒక్కరూ మీ ఇంటిలో మొక్కలు నాటించాలి వాటిని పరిరక్షించాలి మన తోటి వారితో కూడా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని బాధ్యతలు తీసుకోవాలి మొక్కలు అనేవి మానవ జీవితంలో ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయి సమాజంలో అభివృద్ధి పేరు మీద మొక్కలను అడవులను నరికి వేయడం జరుగుతుంది ఒక మొక్కను తీసేసినప్పుడు పది మొక్కలు నాటాలి పరిరక్షించాలి వాటిని పెంచాలి అని నినాదాన్ని ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని సమాజంలోని ప్రజలకు సూచించాలి అని మొక్కలనేవి ప్రపంచ ఊపిరితిత్తులుగా పరిగణించబడతాయి అవి వాతావరణం లో కార్బన్డయాక్సైడ్ స్వీకరించి ఆక్సిజన్ విడుదల చేసి పర్యావరణంలో వర్షాలు కురవడానికి వాతావరణం సమతుల్యత ఉంచడానికి మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయి అని విద్యార్థులు ఉద్దేశించి ప్రసంగించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసయ్య ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రసాద్. అబ్దుల్ గని. సమ్మయ్య .సదాశివ్ . సదానందం . సంధ్య . శ్వేత రమాదేవి . కర్ణ ప్రకాష్ . మహేష్ శ్రీనివాస్ . సనత్ కుమార్ . సునీల్. ఔూ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి. రమేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## వెదురు మొక్కల పెంపకంపై అవగాహన.

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో వెదురు మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఐకేపీ ఏపీఎం రాజన్న, సీసీ శశికాంత్ మాట్లాడుతూ.. రైతులు 15 గుంటల భూమిలో సుమారు 60 వెదురు మొక్కలను నాటి మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. వెదురు మొక్కలు మూడు సంవత్సరాల్లో కోతకు సిద్ధమవుతాయని, ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చుగా 15 గుంటలకు రూ.15,000 చొప్పున అందించనున్నట్లు వివరించారు. కోతకు వచ్చిన వెదురు ద్వారా రైతులకు సంవత్సరానికి సుమారు రూ.50 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.48 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

**గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర**

**జయశంకర్ భూపాలపల్లి.** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. పంబపూర్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, గొల్లబుద్ధారంలో రూ.9 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, శ్యామ్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మొరంచపల్లి గ్రామంలో లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల్లో రవాణా సౌకర్యాల మెరుగుదలతో పాటు రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతే రాష్ట్ర అభివృద్ధికి పునాదులని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, నాణ్యతతో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## తెలంగాణ పోలీస్ మీట్ స్పోర్ట్స్‌లో రాణించిన శ్రీలత....

**మూడు పతకాలు సాధింపు...**

**కమాన్ పూర్ :** ఆమె పాల్గొంటే చాలు పతకం రావాల్సిందే. హైదరాబాద్ లోని మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో ఈనెల 7 నుండి 9 వరకు జరిగిన ఐదవ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో కమాన్ పూర్ పోలీస్ స్టేషన్ లో మహిళ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కూరపాటి శ్రీలత మూడు పతకాలను సాధించింది. ఇందులో కాళేశ్వరం జోన్ నుండి రామగుండం కమిషనరేట్ గోదావరిఖని టూ టౌన్ పరిధిలోగల కమాన్ పూర్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కూరపాటి శ్రీలత యోగ ట్రెడిషనల్ లో గోల్డ్ మెడల్ ,యోగ ఆర్టిస్ట్ సింగిల్ లో సిల్వర్ మెడల్, యోగ రిత్విక్ పేర్ లో బ్రాంజ్ మెడల్, అలాగే యోగా ఆర్టిస్ట్ ఫెయిర్ మరొక బ్రాండ్ మెడల్ సాధించారు. ఇందులో కాళేశ్వరం జోన్ రాజన్న సిరిసిల్ల జోన్ భద్రాద్రి కొత్తగూడెం బాసర జోన్ యాదాద్రి జోన్ చార్మినార్ జోన్ జోగులాంబ జోన్ నుండి పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు. పతకాలు సాధించిన వారికి మల్కాజ్గిరి పోలీస్ అధికారులు మెడల్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




# సుకుమారి వెనకున్న రహస్యం

తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ..సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం థియేట్రికల్ ట్రైలర్‌ని అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. కథానాయిక దామినికి ఊరంతా భయపడుతుంటారు. అందుక్కారణం..ఆమెను ఎవరైనా తాకితే వారికి కరెంట్ షాక్ కొడుతుంది. ఈ రహస్యాన్ని దాచిపెట్టి ఆమెకు హీరోతో పెళ్లి చేస్తారు. ఆ తర్వాత అసలు విషయం తెలిసిన హీరో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు? వారి దాంపత్యం ఎలా సాగింది? అన్నదే ఈ చిత్ర కథాంశం. పల్లెటూరి నేపథ్యంలో ట్రైలర్ ఆద్యంతం వినోదం, భావోద్వేగాల కలబోతగా సాగింది. మురళీధర్ గౌడ్, విష్ణు ఓయి, ఝాన్సీ, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, దర్శకత్వం: భరత్ దర్శన్.

# మళ్లీ షురూ

'వారణాసి' షూటింగ్ పనులు మళ్లీ ఉపందుకున్నాయి. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వారణాసి'. ప్రియాంకా చోప్రా పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌కు ఇటీవల చిన్న విరామం వచ్చింది. దీంతో కుటుంబంతో కలిసి విదేశాలకు విహార యాత్రకు వెళ్లారు మహేశ్‌బాబు. మరోవైపు తన గత చిత్రాలు (ఆర్ఆర్ఆర్, బాహుబలి, ఈగ, మర్యాద రామన్న) పారిస్‌లో ప్రదర్శితమైన నేపథ్యంలో అక్కడికి వెళ్లారు రాజమౌళి. తాజాగా ఈ ఇద్దరూ హైదరాబాద్ చేరకున్నారని సమాచారం. దీంతో 'వారణాసి' షూటింగ్ మళ్లీ షురూ అయ్యిందని తెలిసింది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే ప్రారంభం కానుందట. ఈ షెడ్యూల్‌లో మొదట మహేశ్‌బాబు పాల్గొనరని, ఈ నెల 16 తర్వాత పాల్గొంటారని సమాచారం. ఈ షెడ్యూల్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఈ షూట్‌లో దాదాపు 3 వేల మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటారని భోగట్టా. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.





# కనకరాజు వచ్చేది ఆరోజే!

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని ఆగస్ట్ 7న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇండియన్-కొరియన్ కల్చర్ కలబోతగా హారర్ కామెడీతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా శుక్రవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌తేజ్ ఓ చేతిలో కత్తి, మరో చేతిలో గ్రెనేడ్ పట్టుకొని రఫ్ అండ్ అల్ట్రాస్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. కొరియన్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ కథలో వరుణ్‌తేజ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: మేర్లపాక గాంధీ.



# ప్రమోషనల్ పోస్ట్‌కు పదిలక్షలు?

సినిమాల పరంగా విజయాలు తక్కువే అయినా అచ్చ తెలుగందం శ్రీలీల క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. అందుకు యూత్‌లో ఈ భామకున్న ఫాలోయింగ్‌ను కారణంగా చెప్పొచ్చు. చూడముచ్చటైన రూపలావణ్యం, చలాకీ నటనతో ఈ భామ కుర్రకారులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సొగసరి సినిమాల కంటే సోషల్‌మీడియా ద్వారానే భారీగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిసింది. శ్రీలీల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 17 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ఈ వేదికలో ఒక్క ప్రమోషనల్ పోస్ట్‌కు ఆమె 5 నుంచి 10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా నెలరోజుల్లో దాదాపు 50 లక్షల వరకు ఈ భామ ఆర్జిస్తున్నదని ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది. సోషల్‌మీడియాలో బ్రాండ్ కొలాబరేషన్స్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్న కథానాయికల్లో శ్రీలీల ఒకరని చెబుతున్నారు. మరి ఈ వార్తల్లో నిజమెంతో తెలియదు కానీ.. ట్రేడ్ వర్గాల్లో మాత్రం బాగా ప్రచారమవుతున్నది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,